ప్రజాశక్తి

ఆదివారం 12 మే 2024 1

అనంతపురం శ్రీ సత్యసాయి





సంక్షేమాన్ని కొనసాగిస్తాం..



అనంతపురంలో రోడ్‌షో ద్వారా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైసిపి అభ్యర్థి అనంత

'ఐదేళ్ల పాటు సంక్షేమ పాలన కొనసాగించాం. అందరికీ సంక్షేమ పథకాలను లబ్ధిని చేకూర్చాం. ఇవి ఇలాగే కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో వైసిపి ఓటు వేసి మరోసారి గెలిపించాలి' అంటూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వైసిపి నాయకులు ప్రచారాలు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారాల చివరి రోజు అన్ని నియోజకవర్గాల్లోనూ వైసిపి శ్రేణులు పెద్ద ఎత్తున ప్రచారాలు నిర్వహించారు. సభలు, రోడ్‌షోల ద్వారా ప్రజలను కలిసి ఓట్లు అభ్యర్థించారు.

వైసిపి పాలనలో వెనుకబాటు..



హిందూపురం ప్రచారంలో ప్రసంగిస్తున్న టిడిపి అభ్యర్థి బాలకృష్ణ

'వైసిపి పాలనలో రాష్ట్రంలో వెనుకబాటుకు గురైంది. కనీసం రాష్ట్రానికి రాజధాని కూడా లేని పరిస్థితి నెలకొంది. ఇలాంటి పార్టీకి వచ్చే ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పి టిడిపిని గెలిపించాలి' అంటూ తెలుగుదేశం పార్టీ నాయకులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచారాలు నిర్వహించారు. వైసిపి ఐదేళ్లలో రాష్ట్రానికి ఏమీ చేయలేదని చెబుతూనే టిడిపి అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ లబ్ధి చేకూర్చడంపై వివరిసూ ఓట్లు అభ్యర్థించారు. అన్ని నియోజక వర్గాల్లో టిడిపి ముఖ్య నేతలు ప్రచారాలు చేశారు.

బిజెపి పొత్తు,తొత్తులను తరమండి..



ప్రచారంలో భాగంగా అనంతలో ఇండియా వేదిక సిపిఐ అభ్యర్థి జాఫర్ బైక్ ర్యాలీ

'పదేళ్ల బిజెపి పాలనలో దేశం సర్వనాశనం అయ్యింది. మతతత్వ విధానాలతో ప్రజల మధ్య చీలిక తెచ్చారు. ప్రత్యేక ఇవ్వకుండా మోసం చేశారు. ఇలాంటి పార్టీలతో పొత్తు పెట్టుకున్న టిడిపి, జనసేన, తొత్తుగా ఉన్న వైసిపికి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి' అంటూ ఇండియా వేదిక అభ్యర్థులు ప్రచారాలు చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్, అనంతపురం అర్బన్‌లో సిపిఐ అభ్యర్థులు శనివారం నాడు విస్తృత ప్రచారం నిర్వహించి ఇండియా వేదిక అభ్యర్థులకు ఓటు వేయాలని ఓటర్లను కోరారు.

అందరూ ఓటెయ్యాలి

జిల్లా ఎన్నికల అధికారి డా॥వి.వినోద్ కుమార్



విలేకరులతో మాట్లాడుతున్న కలెక్టర్ వి.వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఈ నెల 13వ తేదీన జరిగే సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా॥వి.వినోద్‌కుమార్ సూచించారు. అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో శనివారం సాధారణ ఎన్నికలు - 2024 కు సంబంధించి ఎన్నికల నిర్వహణ, పోలింగ్ తదితర అంశాలపై కలెక్టర్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ ఎన్నికల పోలింగ్ రోజు ఓటర్లు పెద్ద ఎత్తున తరలివచ్చి ఓటు హక్కును వినియోగించు కోవాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో అత్యంత ముఖ్యమైనది ఈనెల 13వ తేదీన నిర్వహించే పోలింగ్ అన్నారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనపై నిరంతర నిఘా

మిగతా 3లో

పోలింగ్‌కు సర్వం సిద్ధం

కలెక్టర్ పి.అరుణ్ బాబు, ఎస్పీ మాధవరెడ్డి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

శ్రీ సత్యసాయి జిల్లాలో ఈనెల 13న జరగనున్న ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం చేశామని కలెక్టర్ అరుణ్ బాబు, ఎస్పీ మాధవరెడ్డి తెలియజేశారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 16,56,775 మంది ఓటర్లు ఉన్నారన్నారు. పోలింగ్ కేంద్రాలు 1571 ఉన్నాయన్నారు. సమస్యలు లేని పోలింగ్ కేంద్రాలు 1262 ఉండగా, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు 299 ఉన్నాయన్నారు. ఎన్నికల సమయంలో 2.35



విలేకరులతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

మిగతా 3లో


మూగబోయిన మైకులు..!

- జోరందుకున్న ప్రలోభాలు
- పోలింగ్ ఏర్పాట్లలో అధికార యంత్రాంగం



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల సమయం ముంచుకొచ్చేసింది. పోలింగుకు 72 గంటల ముందే ప్రచారాలు నిలిపివేయాల్సి ఉన్న నేపథ్యంలో శనివారం సాయంత్రం నుంచి ప్రచారాలు ఆగిపోయాయి. ఆఖరి రోజు పెద్దఎత్తున అభ్యర్థులు ప్రచారాలు నిర్వహించారు. రోడ్‌షోలు, బైకు ర్యాలీలు ఇలా వివిధ రూపాల్లో ప్రచారాలు జోరుగా సాగాయి. అదే సమయంలో ఓటర్లకు గాలమేసే ప్రలోభాలు మరింత పెరిగాయి. ఓటుకు వెయ్యి రూపా యల నుంచి రెండు వేల రూపా యల వరకు ప్రధాన రాజ కీయ పార్టీలైన వైసిపి, టిడిపిల నుంచి పంపిణీ సాగుతోంది. ఇంటింటికెళ్లి ఓటర్లకు నోట్లను పంచే కార్యక్రమం జోరందుకుంది. అవసరమైతే ఇంకా పెంచి అయినా ఇవ్వాలన్న ఆలోచనల్లో అభ్యర్థులున్నట్టు తెలుస్తోంది. ఇకపోతే అధికార యంత్రాంగం పోలింగ్‌కు అవసరమైన ఏర్పాట్లలో తలమునకలై ఉన్నారు. ఇప్పటికే ఆయా నియోజకవర్గ కేంద్రాల్లోని స్ట్రాంగ్ రూముల్లో ఇవిఎంలున్నాయి. వీటిని ఆదివారం ఉదయం తెరచి పోలింగ్ సిబ్బందికి అప్పగించే కార్యక్రమం నడుస్తుంది. సజావుగా పంపిణీ చేపట్టేందుకు అవసరమైన చర్యలను అధికారులు తీసుకుంటున్నారు.



అనంతపురం జిల్లా

అనంతపురం జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 20,18,162 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 9,97,792 కాగా, మహిళా ఓటర్లు 10,20,124 ఉన్నారు. 246 మంది ఇతరులున్నారు. 2236 పోలింగు స్టేషన్లు ఉన్నాయి. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు 2472 మంది ప్రిసైడింగు అధికారులు, 2552 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, 10,208 మంది ఇతర పోలింగ్ సిబ్బందిని

మిగతా 3లో

స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలి

బెలుగుప్ప : సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిఒక్కరూ స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను జెసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అధికారులు అప్రమత్తంగా ఉండి ఓటర్లకు ఎలాంటి సమస్య లేకుండా చూడాలన్నారు. అయితే పోలింగ్ కేంద్రాల్లో సక్రమంగా సౌకర్యాలు లేకపోవడంతో అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. వెంటనే విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లు, తాగునీరు, ఫర్నిచర్ వంటి సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అరుణాకర్, ఎంపిడిఒ సుబ్బరాజు, ఎస్ఐ శివ, డిప్యూటీ తహశీల్దార్‌లు హుస్సేన్‌పీరా, ఎఒ పృథ్వీసాగర్, ఎంఇఒ హరికృష్ణ, ఇఒఆర్‌డి మాధవరెడ్డి, పిఆర్ జెఇ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

స్వతంత్ర అభ్యర్థి ముమ్మర ప్రచారం

గుత్తి : పట్టణానికి చెందిన స్వతంత్ర అభ్యర్థి షేక్ మహబూబ్ బాషా శనివారం ముమ్మరంగా ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇందులో భాగంగా పలువార్డుల్లో ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో గ్లాసు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు.

టిడిపి నాయకుల ఎన్నికల ప్రచారం

పుట్లూరు : మండలంలోని ఓబుళాపురం, దోసలేడు, ఎస్.గూడూరు గ్రామాల్లో టిడిపి నాయకులు శనివారం వేర్వేరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాలను వివరించారు. ఆయా కార్యక్రమాల్లో తెలుగు యువత మండల అధ్యక్షులు విజయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు శ్రీనివాసనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులకు అనుగుణంగా బస్సులు

రాయదుర్గం రూరల్ : ఎన్నికల విధుల్లో పాల్గొనేందుకు వెళ్లాల్సిన సిబ్బంది సమయానికి అనుగుణంగా బస్సులు ఏర్పాటు చేసినట్లు రాయదుర్గం ఆర్టీసీ డిపో మేనేజర్ సురేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాయదుర్గం నుంచి ఎన్నికల విధులకు వెళ్లే వారి కోసం వివిధ రూట్లలో ఉదయం 6 గంటల నుంచే బస్సుల నడుపుతున్నట్లు తెలిపారు.

ప్రశాంత వాతావరణంలో పోలింగ్

వజ్రకరూరు : ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విడపనకలు ఎస్ఐ ఖాజాహుస్సేన్ కోరారు. ఎస్పీ అమిత్‌బర్దర్ ఆదేశాల మేరకు విడపనకల్లు మండలంలోని డోనేకల్, గడేకల్, విడపనకల్ గ్రామాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లోని ప్రధాన రహదారులు, ముఖ్యమైన కాలనీల గుండా కవాతు సాగింది. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా పోలీసులు పని చేస్తున్నట్లు తెలిపారు. రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా ప్రశాంత వాతావరణం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సాయుధ బలగాలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు లేకుండా పోలింగ్‌ను నిర్వహిద్దాం

అనంతపురం క్రైం : అంకితభావంతో పని చేసి పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేలా కృషి చేద్దామని ఎ.ఆర్ అదనపు ఎస్పీ ఎస్.లక్ష్మీనారాయణరెడ్డి, అనంతపురం రూరల్ డిఎస్పీ బి.వి శివారెడ్డి పిలుపునిచ్చారు. ఎస్పీ అమిత్‌బర్దర్ ఆదేశాల మేరకు రాప్తాడు, శింగనమలల్లో సెక్టార్ పోలీసు అధికారులు, రూట్ ఆఫీసర్లు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా పోలింగ్ రోజు ఏంచేయాలో, ఏం చేయకూడదో దిశానిర్దేశం చేశారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శింగనమల, పుట్లూరు, బుక్కరాయసముద్రం సి.ఐలు శ్రీధర్‌రాజు, సుబ్రమణ్యం, వెంకటేశులు, ఇటుకలపల్లి సి.ఐలు మునిస్వామి, నరేంద్రరెడ్డి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎ.ఆర్ అదనపు ఎస్పీ ఎస్.లక్ష్మీనారాయణరెడ్డి

'కేశవ్' మాయమాటలను నమ్మొద్దు..

వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పయ్యావుల కేశవ్ చెప్పే కల్లబొల్లి మాటలను ప్రజలు నమ్మొద్దని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రచారం చివరి రోజు కావడంతో శనివారం ఉరవకొండలో భారీ రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేశవ్ లాంటి మోసగాళ్లను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. పయ్యావులఉత్తర కుమారుడు లాంటివాడని.. సరిగ్గా యుద్ధం వచ్చినప్పుడు బృహన్నను పెట్టి యుద్ధంలో రథం దిగి పారిపోతాడని ఎద్దేవా చేశారు. అలాగే ప్రజలు కష్టంలో ఉంటే కూడా నియోజకవర్గాన్ని పట్టించుకోకుండా ఎన్నికలు వస్తే మాత్రమే కనపడుతూ మిగిలిన సమయాల్లో పారిపోతాడని గుర్తు చేశారు. గత ఎన్నికల్లో లబ్ధి పొందాలని కేశవ్ పేదలకు పట్టాలిచ్చి.. ఒక్కో పట్టాలో 14 సర్వే నంబర్లు వేసినప్పుడే ఆయన చేసిన మోసం ప్రజలకు తెలిసిందన్నారు. 20 సంవత్సరాలు ఎమ్మెల్యేగా.. మూడేళ్ల ఎమ్మెల్సీగా పని చేసిన నీవు శాశ్వతంగా నీటి సమస్యలు ఎందుకు పరిష్కరించలేకపోయావ్.. అని ప్రశ్నించారు. ఏనాడైనా తాము వేసినన్ని రోడ్లు వేసావా..? అని నిలదీశారు. అదేవిధంగా టిడిపి దొంగ హామీలతో మీ ముందుకు వచ్చిందని అవి నమ్మి మోసపోవద్దని విన్నవించారు. ఈసారి ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే ఉరవకొండ అభివృద్ధికి మరింత సాధ్యమన్నారు. కావున 13న జరిగే ఎన్నికల్లో వైసిపి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి

అలాగే విడపనకల్లు మండలంలోని పలు గ్రామాల్లో వైసిపి నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

'అనంత' వైద్య కళాశాలలో 112 పీజీ సీట్లు

ప్రజాశక్తి-అనంతపురం

ప్రస్తుతం మంజూరైన పీజీ సీట్లతో అనంతపురం వైద్య కళాశాలలో 112 పీజీ సీట్ల సంఖ్య చేరినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మాణిక్యరావు తెలిపారు. ఈమేరకు ప్రిన్సిపాల్ ఛాంబర్‌లో ప్రొఫెసర్లు, డాక్టర్లతో కలిసి శనివారం కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జనరల్ మెడిసిన్ విభాగంలో నాలుగు, ఆర్థోపెడిక్స్‌కు నాలుగు పీజీ సీట్లు నేషనల్ మెడికల్ కమిషన్ మంజూరు చేసినట్లు తెలిపారు. జాతీయ వైద్య మండలి పిజి సీట్ల కోసం నిర్వహించిన సమీక్షల్లో అనంత వైద్య కళాశాల, ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నాణ్యత ప్రమాణాలు అత్యంత బాగుండటంతో పీజీ సీట్లు పెంచినట్లు తెలిపారు. అంతేగాకుండా పీజీ సీట్ల పెంపులో ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కెఎస్ఎస్ వెంకటేశ్వరరావు, జనరల్ మెడిసిన్ ప్రధాన విభాగాధిపతి డాక్టర్ భీమసేనాచారి, ఆర్థోపెడిక్ ప్రధాన విభాగాధిపతి డాక్టర్ ఆత్మారాం, గైనకాలజీ ప్రధాన విభాగాధిపతి డాక్టర్ శంషాద్‌బేగంతోపాటు సిబ్బంది కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల ఎస్ఎంసి బృందం సభ్యులు డాక్టర్ శ్యాంప్రసాద్, డాక్టర్ పద్మ శ్రావణి, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ ప్రవీణ్ దీన్‌కుమార్, డాక్టర్ బసిరెడ్డి ప్రవీణ, డాక్టర్ బిఎంఎస్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


సంబరాలు చేసుకుంటున్న మెడికల్ కళాశాల సిబ్బంది

ఓటుకు రూ.10వేలు ఇచ్చినా 'మెట్టు' గెలవలేడు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి ఒక్కో ఓటుకు రూ.10వేలు పంచినా ఓడిపోవడం ఖాయమని మాజీమంత్రి కాలువ శ్రీనివాసులు అన్నారు. శనివారం పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెట్టు గోవిందరెడ్డి గతంలో ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, ఎపిఐఐసి ఛైర్మన్‌గా పని చేసినా రాయదుర్గం ప్రాంతానికి ఏమీ చేయలేని అసమర్థుడు, చేతకానివాడు అని దుయ్యబట్టారు. గోవిందరెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రాయదుర్గం అభివృద్ధిపై కనీసం కలెక్టర్‌తోగానీ, అసెంబ్లీలోగానీ మాట్లాడిన దాఖలాలు లేవన్నారు. ఆఖరికి స్వగ్రామం పక్కన ఉన్న ఉంతకల్లు వద్ద రిజర్వాయర్ నిర్మిద్దామనే ఆలోచన కూడా ఆయనకు రాకపోవడం బాధాకరమన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం గాలి వీస్తోందన్నారు. జగన్ ను తక్షణం దించి వేయాలనే కసి, పట్టుదల జనంలో కనిపిస్తోందన్నారు. రాయదుర్గంలో కనీసం 50వేలకు తగ్గకుండా మెజార్టీతో విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. తనకు ఓటు వేసి గెలిపిస్తే ఉంతకల్లు రిజర్వాయర్‌తోపాటు నేమకలు వద్ద సెజ్ ఏర్పాటు, గార్మెంట్స్ రంగాన్ని ప్రోత్సహించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.


విలేకరులతో మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

రూ.3750 కోట్లతో సంక్షేమం, అభివృద్ధి

ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-వజ్రకరూరు

ఉరవకొండ నియోజకవర్గవ్యాప్తంగా రూ.3,750 కోట్లతో సంక్షేమంతోపాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని వైసిపి ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షులు వై.రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఉరవకొండ పట్టణంలోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎన్నాళ్ల నుంచో పెండింగ్‌లో ఉన్న జిడిపల్లి రిజర్వాయర్‌కు మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి విజ్ఞప్తి మేరకు రూ.83 కోట్లతో స్థిరీకరణ చేశారన్నారు. హంద్రీనీవా కాలువ కూడా 40 వేల క్యూసెక్కుల నుంచి 90 వేల క్యూసెక్కులకు పెంచడమేకాక రాయలసీమ ఎత్తిపోతల పథకం ద్వారా శ్రీశైలం వెనుకజలాల ద్వారా 800 అడుగుల్లో కూడా నీళ్లు తీసుకునే అవకాశం ఉందన్నారు. ఉరవకొండ అభివృద్ధి చెందాలన్నా.. పొలాల్లో నీళ్లు రావాలన్నా.. వైసిపికే ఓటేయ్యాలన్నారు. కావున వచ్చే ఎన్నికల్లో వైసిపికి ఓటు వేసి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు జ్ఞానేశ్వర్‌రెడ్డి, తేజోమూర్తి, నాయకులు రాంబాబు, తిలక్, విష్ణు, మారుతి, పెద్దఓబులేసు, ఆంజనేయులు, నాగన్న, తదితరులు పాల్గొన్నారు.


మేనిఫెస్టోను విడుదల చేస్తున్న జెవివి నాయకులు

జెవివి మేనిఫెస్టో విడుదల

గుత్తి : పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహం ఎదురుగా జన విజ్ఞాన వేదిక మేనిఫెస్టోను శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా జెవివి రాష్ట్ర నాయకులు డాక్టర్ ఎం.రంగన్న మాట్లాడుతూ సైంటిఫిక్ టెంపర్, సైన్సు, టెక్నాలజీ, పర్యావరణం, నీటి వనరులు, ఆరోగ్యం, వ్యవసాయం, విద్యారంగం, సామాజిక రక్షణ అంశాలతో కూడిన మేనిఫెస్టోతో ప్రజల వద్దకు వెళ్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జెవివి మండల అధ్యక్షులు ఎ.రామాంజనేయులు, నాయకులు గురుశంకర్, జయ రంగారెడ్డి, రమేష్, సి.విజయభాస్కర్, కృష్ణమూర్తి, కాంతారెడ్డి, సిపిఐ నాయకులు ఎ.సూర్యనారాయణరెడ్డి, జి.రామదాసు, కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, విశ్రాంత ఉపాధ్యాయులు రామాంజనేయులు, జన్నే కుల్లాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

రూ.కోటికిపైగా స్వాహా చేసిన ప్రజాప్రతినిధి

రాయదుర్గం రూరల్ : పట్టణ శివార్లలోని బిటిపి లేఔట్‌లో ఓ ప్రజాప్రతినిధి ఇల్లు నిర్మించుకునేందుకు భూ యజమానుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి ప్రభుత్వానికి అధిక ధరకు విక్రయించి రూ.కోటికిపైగా స్వాహా చేశాడని రాయదుర్గం బిఎస్‌పి ఎమ్మెల్యే అభ్యర్థి నాగరాజు ఆరోపించారు. శనివారం పట్టణంలోని బిఎస్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భూ యజమానులకు కేవలం రూ.36 లక్షలు చెల్లించి రూ.కోటికిపైగా ప్రజా ప్రతినిధి స్వాహా చేసిన విషయాన్ని ఆధారాలతో సహా ఉన్నట్లు చెప్పారు. వెంటనే సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు.

స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరగాలి

గుంతకల్లు : స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరగాలని న్యాయవాదుల సంఘం నాయకులు వి.నాగరాజు కోరారు. శనివారం స్థానిక లాయర్ బార్ కౌన్సిల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాజకీయ నాయకులు గెలుపు లక్ష్యంగా ప్రజలకు ఇచ్చే వివిధ ఉచిత వాగ్దానాలను నమ్మకుండా భావితరాల అభివృద్ధికి కృషి చేసే వ్యక్తిని ఎన్నుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఎంజి.భాస్కర్‌గౌడ్, రాము, జయరామ్‌తోపాటు 30 మంది న్యాయవాదులు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకోవాలి

అనంతపురం : సార్వత్రిక ఎన్నికల కురుక్షేత్రంలో ప్రజలందరూ నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకోవాలని ఐక్యరాజ్యసమితి అవార్డు గ్రహీత బిసాటి భరత్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటూ చాలా కీలకమన్నారు. ప్రతి ఐదేళ్లకు ఒక్కసారి వచ్చే ప్రజాస్వామ్య పండుగలో ప్రతి ఒక్కరూ పాల్గొని రాజ్యాంగం వారికి అందించిన అమూల్యమైన ఓటుహక్కు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న ఐక్యరాజ్యసమితి అవార్డు గ్రహీత బిసాటి భరత్

విద్యుత్ స్తంభం పైనుంచి పడి వ్యక్తి మృతి

ఆత్మకూరు : మండల పరిధిలోని వడ్డుపల్లి గ్రామానికి చెందిన ఆదినారాయణరెడ్డి (50) శనివారం విద్యుత్ స్తంభంపై నుంచి పడి మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. ఆదినారాయణరెడ్డి వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. వ్యవసాయ పనులు లేనప్పుడు విద్యుత్ కాంట్రాక్టర్ వద్ద కూలి పనులకు వెళ్తూ ఉండేవాడు. ఇందులో భాగంగానే విద్యుత్ పనులు చేస్తుండగా విద్యుత్ స్తంభం పైనుంచి పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ మునీర్‌అహ్మద్ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఓటుకు ప్రలోభాల ఎర..!



వైసిపి కార్యాలయంలో డబ్బులు తక్కువ ఇచ్చారంటూ ఆరోపిస్తున్న అహ్మద్ నగర్ ప్రాంతానికి చెందిన మహిళలు

టిడిపి నాయకులు పగలు స్లిప్పులు.. రాత్రికి డబ్బులు అందజేత..!

నగదు పంపిణీ పూర్తి చేసిన అధికార పార్టీ

తక్కువ ఇచ్చారంటూ వైసీపీ కార్యాలయం వద్ద మహిళల ఆందోళన



టిడిపి నాయకులు అందించిన స్లిప్పులు

ప్రజాశక్తి-హిందూపురం

గెలుపు కోసం ఎన్ని అడ్డదారులైనా తొక్కడానికి మేము సిద్ధం అనే విధంగా వైసిపి, టిడిపిలు వ్యవహరిస్తున్నాయి. హిందూపురం నియోజకవర్గంలో ఎన్నికల సంఘం తరపున బూత్ లెవెల్ అధికారులు ఓటర్లకు అందించిన ఓటరు స్లిప్‌లను టిడిపి నాయకులకు చూపిస్తే... పార్టీ సింబల్‌తో కూడిన ఓటరు స్లిప్‌లను పగలు ఇస్తారు. రాత్రికి మూడో కంటికి తెలియకుండా ఆ స్లిప్‌లను తీసుకుని ఓటుకు రూ.2 వేలు పంపిణీ చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే టిడిపి నాయకులు నియోజకవర్గంలో సుమారుగా అన్ని గ్రామ పంచాయతీల్లో డబ్బులను పంపిణీ చేసినట్లు తెలుస్తోంది. పంపిణీ చేయని ప్రాంతాల్లో ఆదివారం రాత్రిలోగా అందరికీ పంపిణీ చేయాలనే లక్ష్యం విధించుకున్నారు. ఇక అధికారంలో ఉన్న వైసిపి అధికారుల అండదండలతో చిత్తూరు జిల్లాకు చెందిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరులు నియోజకవర్గంలో అన్ని గ్రామాలతో పాటు పట్టణంలోని అన్ని వార్డుల్లో ఓటుకు రూ. 2 నుంచి రూ. 3 వేల వరకు పంపిణీ చేసినట్లు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

డబ్బులు తక్కువ ఇచ్చారంటూ ఆందోళన

హిందూపురం.పట్టణంలోని 32వ వార్డు అహ్మద్ నగర్, మోడల్ కాలనీకి చెందిన పలువురు మహిళలు ఓటుకు రూ.3 వేలు ఇవ్వకుండా రూ.వెయ్యి మాత్రమే ఇచ్చారంటూ వైసిపి కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అన్ని వార్డుల్లో రూ.3వేలు ఇచ్చి తమకు రూ.వెయ్యి మాత్రమే ఇచ్చారని నాయకులకు తెలియజేశారు. అక్కడ ఉన్న నాయకులు వార్డు కౌన్సిలర్‌ను కలవాలని, అయనకు ఓటుకు రూ.3 వేలు చొప్పున ఇచ్చామని మహిళలకు తెలియజేశారు. ఆయన్ను కలిస్తే డబ్బులు ఇస్తాడని చెప్పి వారిని అక్కడి నుంచి పంపించేశారు. దీంతో ఆ మహిళలందరూ తమకు ఇచ్చిన డబ్బులలో వార్డు కౌన్సిలర్లు సగానికి పైగా తీసుకొని కొంత మాత్రమే ఇచ్చారన్నారు. డబ్బుల పంపిణీపై ఈ విషయాలన్నీ ఎన్నికల అధికారులతో పాటు పోలీసులకు సైతం తెలిసినప్పటికీ తమకేమీ తెలియదు అన్నట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

సిపిఎం నుంచి ఎంపిటిసి రమీజాబీ బహిష్కరణ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం రూరల్ ఎంపీటీసీ సభ్యురాలు రమీజాబీని పార్టీ నుంచి బహిష్కరించినట్లు సిపిఎం జిల్లా కమిటీ శనివారం ఓ ప్రకటనలో తెలియజేసింది. సిపిఎం నుంచి పోటీ చేసి ఎంపిటిసిగా గెలుపొందిన రమీజాబీ సిపిఎం విధానాలకు వ్యతిరేకంగా ప్రవర్తించిన నేపథ్యంలో ఆమెను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు సిపిఎం నగర ఒకటో కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి తెలిపారు. ఈనెల 9వ తేదీన ఎంపీటీసీ సభ్యురాలు రమీజాబీ తెలుగుదేశం పార్టీలో చేరారన్నారు. దీనిని సిపిఎం జిల్లా కమిటీ తీవ్రంగా పరిగణించి ఆమెను పార్టీ నుంచి బహిష్కరించినట్లు తెలియజేశారు. ఈమెతో పాటు మహదేవ్ నగర్ పార్టీ సభ్యులైన బాబును కూడా పార్టీ అన్ని బాధ్యతలు, సభ్యత్వం నుంచి తొలగించామన్నారు. పార్టీ నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

అభివృద్ధి.. సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం కందికుంట వెంకటప్రసాద్

ప్రజాశక్తి-కదిరి టౌన్



కందికుంట వెంకటప్రసాద్

కదిరి నియోజకవర్గం అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ తెలియజేశారు. ప్రచారం ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడుతూ కదిరి నియోజకవర్గం అభివృద్ధిపై టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు స్పష్టమైన హామీలను ఇచ్చారన్నారు. టిడిపి ప్రభుత్వం ఏర్పడిన నెల రోజుల్లోనే కదిరి-రాయచోటి ప్రధాన రహదారి సమస్యను పరిష్కరిస్తామన్నారు. టిడిపి హయాంలో నిర్మించిన టిడ్కో గృహాలను పూర్తిచేసే లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. గాండ్లపెంట ఎన్‌పి.కుంట, మండలాలకు హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ద్వారా రైతులకు సాగునీరందిస్తామని తెలియజేశారు. చెర్లోపల్లి రిజర్వాయర్ నుంచి కదిరి పట్టణానికి మంచినీరు సరఫరా చేస్తామన్నారు. గాండ్లపెంట మండలంలో ఆగిపోయిన మైనార్టీ కళాశాలను పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. దీంతో పాటు టిడిపి అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలను అర్హులందరికీ అందిస్తామని హామీ ఇచ్చారు.

మాజీ ఎంపిపి లీలావతి ప్రచారం

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

మండలంలోని కొండూరుతోపాటు వీరన్నపల్లి గ్రామాల్లో మాజీ ఎంపిపి లీలావతి ఆధ్వర్యంలో టిడిపి నాయకులు శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు జెసి అస్మిత్‌రెడ్డి, అంబికా లక్ష్మీనారాయణకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ఎన్నికల రోజు నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-నార్పల

మండల వ్యాప్తంగా సోమవారం జరిగే సార్వత్రిక ఎన్నికల సమయంలో ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలను పాటించాలని ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలింగ్‌స్టేషన్‌కు 200 మీటర్లు దూరం వరకూ 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. కావున ఎవరూ గుమిగూడదన్నారు. పోలింగ్ కేంద్రానికి వంద మీటర్ల వరకూ దుకాణాలు, హోటళ్లు ఉండకూడదన్నారు. పోలింగ్‌స్టేషన్‌లోకి లౌడ్ స్పీకర్లు, మెగాఫోన్లు అనుమతించమన్నారు. ఆఖరికి అభ్యర్థులతోపాటు వచ్చిన గన్‌మెన్, అనుమతి లేని వ్యక్తులు పోలింగ్ కేంద్రాల 100 మీటర్లు లోనికి ప్రవేశించరాదన్నారు. పోలింగ్ స్టేషన్‌లోకి సెల్‌ఫోన్లు, కార్డ్‌లెస్ ఫోన్లు అనుమతించవన్నారు. అలాగే 200 మీటర్ల పరిధిలో ఎలాంటి షామియానాలు వేయరాదన్నారు. ఓటర్లు క్యూ పద్ధతి పాటించాలన్నారు. ఎన్నికల అధికారులు ఇచ్చిన గుర్తింపుకార్డుతో మాత్రమే పోలింగ్ కేంద్రంలోకి రావాలన్నారు. పోలింగ్ కేంద్రంలోకి అగ్గిపెట్టెలు, సిగరెట్ లైటర్, ఇంకు, నీళ్ల బాటిళ్లు, ఇతర పేలుడు పదార్థాలను అనుమతించమన్నారు. ప్రతి ఒక్కరూ ఆయా నిబంధనలను పాటించి ప్రశాంత ఎన్నికలకు సహకరించాలని కోరారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

రాబోయే సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రజలందరూ సహకరించాలని సీఐ రోషన్, ఎస్ఐ ముత్యాలశ్రీనివాసులు సూచించారు. శనివారం మండలంలోని ఫ్యాక్షన్ గ్రామం దిమ్మగుడిలో ప్రత్యేక బలగాలతో కవాతు నిర్వహించారు. ఇందులో భాగంగా అనుమానితుల ఇళ్లు, పలుచోట్ల సోదాలు చేపట్టారు. అనంతరం పాతబస్టాండ్ ఆవరణలో ప్రజలతో సమావేశమై ఓటింగ్ విధానం, గొడవలు, తదితర అంశాలపై వివరించారు. ఎవరూ ఎలాంటి గొడవలకు వెళ్లకుండా ఎన్నికలు సజావుగా జరిగించేందుకు ప్రతి ఒక్కరూ చూడాలని వారు కోరారు. శాంతియుతంగా పోలింగ్ జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.

ఎన్నికలను సజావుగా నిర్వహిద్దాం

అనంతపురం కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ అమిత్ బర్దర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ అమిత్‌బర్దర్

సాధారణ ఎన్నికల నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లను చేపట్టామని, ఇందుకు సంబంధించి ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అధికారులు అన్ని చర్యలూ తీసుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలియజేశారు. శనివారం ఉదయం అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో సాధారణ ఎన్నికలపై సిపిఎఫ్ కమాండెంట్‌లతో ఎస్పీ అమిత్ బర్దర్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల్లో సిపిఎఫ్ కమాండెంట్లకు కేటాయించిన విధులు, వారి పాత్ర ముఖ్యమైనదన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో సీపీఎఫ్ బలగాలను నియమించినట్లు తెలియజేశారు. ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో ఎన్నికలను సజావుగా నిర్వహించాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం అన్ని రకాల పకడ్బందీ బందోబస్తు చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలలోనూ వంద శాతం వెబ్ కాస్టింగ్ చేస్తున్నామని, పోలింగ్ బూత్ ఆవరణంలో ఎన్నికల కమిషన్ సూచనల మేరకు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. ఎస్పీ అమిత్ బర్దర్ మాట్లాడుతూ ఎన్నికల కోసం పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశామన్నారు. ఎక్కడైనా సమస్యలుంటే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది ఓటర్లు, అభ్యర్థులు, ఏజెంట్ల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. ఈ సమావేశంలో ప్రొబెషనరీ ఐపిఎస్ అధికారులు మాధవ్ ఉపాధ్యాయ్, ప్రశాంత్ రాజ్, అభిషేక్ కుమార్ యాదవ్, రుహాని, శైలజ, భూషరబాను, జిల్లా సైనిక సంక్షేమ అధికారి పి.తిమ్మప్ప, సిపిఎఫ్ కమాండెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

మూగబోయిన మైకులు

నియమించారు. 544 మంది మైక్రో అబ్జర్వర్లున్నారు. పోలింగ్ రోజు ఎటువంటి సాంకేతిక సమస్యలు తలెత్తిన పరిష్కరించేందుకు ప్రత్యేక సాంకేతిక సిబ్బందిని సెక్టార్ లెవల్‌లో ఉంచారు. వారు వెంటనే స్పందించి ఆ సమస్యను అధిగమించే విధంగా ఏర్పాట్లు చేసియున్నారు.

సత్యసాయి జిల్లాలో

సత్యసాయి జిల్లాలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 16,56,775 మంది ఓటర్లు ఉన్నారు. పురుష ఓటర్లు 8,24,048 మంది ఉండగా మహిళా ఓటర్లు 8,32,651 మంది ఉన్నారు. ఇతరులు 76 మంది ఉన్నారు. ఈ జిల్లా పరిధిలో 1571 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. 1875 మంది ప్రిసైడింగ్ అధికారులను నియమించగా 1868 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులను నియమించారు. ఇతర పోలింగ్ సిబ్బంది 7544 మందిని నియమించారు.

కేంద్ర బలాలు రాక

ఉమ్మడి అనంతపురం జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు జిల్లాలోనున్న పోలీసులతోపాటు కేంద్ర బలగాలను కూడా జిల్లాకు విచ్చేసియున్నాయి. సమస్యాత్మక ప్రాంతాల్లో ఈ బృందాలను నియమించనున్నారు. నేడు బ్యాలెట్ బాక్సులతోపాటు ఈ బృందాలు కూడా ఆయా ప్రాంతాలకు చేరుకోనున్నాయి.

అందరూ ఓటెయ్యాలి

కొనసాగుతూ ఉంటుందన్నారు. పోలింగ్ ఏజెంట్‌కు సంబంధించి ఏజెంట్ ఆ పోలింగ్ బూత్ లో ఓటరుగా ఉండక్కర్లేదని, చుట్టుపక్కల ఉన్న పోలింగ్ స్టేషన్లో ఉన్న వారైనా, అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటరుగా ఉన్నవారైనా పోలింగ్ ఏజెంట్‌గా ఉండాలన్నారు. శుక్రవారం సాయంత్రం 6 గంటల నుంచి నియోజక వర్గానికి సంబంధం లేని వారిని వారు ఓటరుగా ఉన్న నియోజకవర్గానికి వెళ్ళమని చెబుతున్నామన్నారు. నియోజకవర్గానికి సంబంధించి ఎవరైనా పోలింగ్ ఏజెంట్ కావచ్చన్నారు. రాజకీయ పార్టీల నుంచి, స్వతంత్రంగా పోటీ చేస్తున్న అభ్యర్థుల నుంచి సంతకంతో ఇవ్వాలన్నారు. అన్ని నిబంధనల మేరకు ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నట్లు తెలియజేశారు. ఈ సమావేశంలో ఎన్‌పిసి డిఐఒ రవిశంకర్ పాల్గొన్నారు.


పోలింగ్‌కు సర్వం సిద్ధం

కోట్లు నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. 15,165 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. 1128 మందిని బైండోవర్ చేసామన్నారు. జిల్లాలో అంతర్‌రాష్ట్ర అంతర్ జిల్లాల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించు కోవాలన్నారు. ఓటర్లు కాని వారు ఈ జిల్లా నుంచి ఈరోజు సాయంత్రమే వెళ్లిపోవాలని ఆదేశించామన్నారు. 13వ తేదీ పోలింగ్ రోజున పోలింగ్ బూత్‌లకు 200 మీటర్ల దూరంలో అభ్యర్థులు ఉండవచ్చన్నారు. అనుమతులు ఉన్న వాహనాలు మాత్రమే అనుమతిస్తామని తెలియజేశారు. ఆయుధాలతో ఎవరూ తిరగరాదన్నారు. జిల్లా అంతటా 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. గుంపులు గుంపులుగా ఎక్కడ ఉండరాదన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలకు అదనపు బలగాలను నియమించామన్నారు. 12వ తేదీ సాయంత్రానికి ఎన్నికల సామగ్రితో ఎన్నికల అధికారులు చేరుకోవాలని తెలియజేశారు. సోమవారం ఉదయం 5:30 గంటలకే మాక్ పోలింగ్ నిర్వహిస్తామన్నారు. పోలింగ్ అనంతరం రాత్రికి బ్యాలెట్ బాక్సులు స్ట్రాంగ్ రూములకు చేరవేస్తామన్నారు. హిందూపురం, పెనుకొండ, మడకశిర బ్యాలెట్ బాక్సులను హిందూపురం బిట్స్ కళాశాలలో గల స్ట్రాంగ్ రూముల్లో భద్రపరుస్తామన్నారు. పుట్టపర్తి, కదిరి, ధర్మవరం నియోజకవర్గాల బ్యాలెట్ బాక్స్‌లను లేపాక్షి సమీపంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాల స్ట్రాంగ్ రూముల్లో భద్రపరుస్తామని తెలియజేశారు. 13న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ఎవరైనా గొడవలకు శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరంగా కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ కొండయ్య, డిపిఆర్ఒ వేలాయుధం పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా సేవలందించాలి : ఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

పోలీసు సిబ్బంది సేవాభావంతో నిష్పక్షపాతంగా వ్యవహరించి సేవలు అందించాలని ఎస్పీ అమిత్‌బర్దర్ సూచించారు. శనివారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో పోలింగ్ రోజు విధుల్లో పాల్గొంటున్న మాజీ సైనికులు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి వలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా సిబ్బంది బాధ్యతలు, సేవలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ, రాష్ట్ర భవిష్యత్తును నిర్దేశించే ప్రజాస్వామ్య పండుగలో సేవలు అందించే అవకాశం రావడం అదృష్టంగా భావించాలని కోరారు. ఈనెల 13న జిల్లాలో పోలింగ్ జరుగనున్న నేపథ్యంలో జిల్లాలో 15 మంది మాజీ సైనికులు, జెఎన్‌టియు, ఎస్‌కెయుకు సంబంధించిన 376 మంది ఎన్ఎస్ఎస్, 49 మంది ఎన్‌సిసి వలంటీర్లను స్పెషల్ పోలీస్ ఆఫీసర్లు (ఎస్పీఓ)గా తీసుకున్నట్లు తెలిపారు. వీరు పోలింగ్ రోజు ఓటర్ల క్యూ మెయింటేన్ విధులకు పంపుతున్నారు. ఓటర్ల పట్ల మర్యాద పూర్వకంగా వ్యవహరించి క్యూలైన్ మెయింటేనేన్ చేయాలని, వృద్ధులు, దివ్యాంగులకు సహాయపడాలని సూచించారు.



భవిష్యత్తు బాగుండాలంటే మళ్లీ వైసిపినే రావాలి

ఎమ్మెల్యే అభ్యర్థి అనంత వెంకటరామిరెడ్డి


అభివాదం చేస్తున్న అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

ప్రజల అభివృద్ధి, భవిష్యత్తు బాగుండాలంటే మళ్లీ వైసిపికే అధికారం ఇవ్వాలని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అనంత వెంకటరామిరెడ్డి విజ్ఞప్తి చేశారు. అనంతపురం నియోజకవర్గ పరిధిలోని రాజీవ్‌కాలనీ పంచాయతీలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న 44 గంటలు అత్యంత కీలకమని, అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మంచి చేస్తున్న ప్రభుత్వానికి తోడుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఓటేసేటప్పుడు గతానికీ, ఇప్పటికీ తేడాను గమనించాలన్నారు. నియోజకవర్గంలో కనీవినీ ఎరుగని విధంగా అభివృద్ధి చేశామన్నారు. ముఖ్యంగా నగరానికి ధీటుగా అనంతపురం రూరల్, నారాయణపురం, రుద్రంపేట, రాజీవ్‌కాలనీ పంచాయతీలను అభివృద్ధి చేశామని వివరించారు. గతంలో రాజీవ్‌కాలనీలో సరైన రోడ్లు, డ్రెయినేజీలు లేవన్నారు. కానీ నేడు పరిస్థితిలో మార్పు వచ్చిందన్నారు. ప్రజలను మోసం చేయడానికి, దోపిడీ చేయడానికే టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిగా ఏర్పడ్డాయన్నారు. గతంలో ఇవే పార్టీలు కూటమిగా ఏర్పడి ఎలాంటి మంచి చేయలేదని గుర్తు చేశారు. అధికారం కోసం మతతత్వ పార్టీతో కూటమి ఏర్పడటం బాధాకరమన్నారు. ముస్లిములు ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. వైఎస్ హయాంలో ముస్లిములకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించారన్నారు. అయితే ఇప్పుడు కూటమి అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను ఎత్తివేసే అవకాశం ఉందని హెచ్చరించారు. జగన్ సీఎంగా ఉంటేనే ముస్లిములకు రిజర్వేషన్లు కొనసాగుతాయన్నారు. అనంతపురం నియోజకవర్గంలో 27 వేలు, రాజీవ్ కాలనీలో 600 మందికి పట్టాలిచ్చామన్నారు. కోవిడ్ వంటి పరిస్థితుల్లోనూ సంక్షేమ పథకాలు అందించిన ఘనత తమ ప్రభుత్వానిదే అన్నారు. 'ఇప్పుడు నా వయసు 68 ఏళ్లు.. మూడేళ్ల క్రితం 65 ఏళ్ల వయసులో కూడా కోవిడ్ వచ్చినప్పుడు ప్రజల సంక్షేమం కోసం ప్రాణాలను సైతం లెక్కజేయకుండా కోవిడ్ బాధితులకు తోడుగా నిలిచానన్నారు. ఇకపోతే మరోసారి అవకాశమిస్తే అనంతపురానికి ధీటుగా నాలుగు పంచాయతీలకు పిఎబిఆర్ నీరు అందిస్తామన్నారు. జగన్ సీఎం అయ్యాక కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించారన్నారు. అర్హతే ప్రామాణికంగా రూ.2.70 లక్షల కోట్లను నేరుగా అందించారన్నారు. కాపు, అగ్రవర్ణాల్లోని మహిళల కోసం కాపు నేస్తం, ఈబీసీ నేస్తం పథకాలు తీసుకొచ్చి ఏటా రూ.15 వేలు అందజేశామన్నారు. మేం సంక్షేమం అందిస్తుంటే రాష్ట్రం అప్పులపాలవుతోందని చెప్పిన కూటమి నాయకులు, ఇప్పుడు ఎన్నికల్లో లబ్ధి కోసం రెట్టింపు సంక్షేమం ఇస్తామని మాయమాటలు చెప్పడం ఎంత వరకూ సబబు అన్నారు. 'సూపర్ సిక్స్'కు ప్రజలు మోసపోవద్దన్నారు. ఐదేళ్లలో జగన్ వల్ల మంచి జరిగితేనే వైసిపికి ఓటు వేయాలన్నారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా శంకరనారాయణను ఆశీర్వదించాలని కోరారు.

అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత

పురానికి భూగర్భ మురుగు కాలువ వ్యవస్థను తీసుకొస్తా

యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం

ప్రజాశక్తితో ఇండియా వేదిక పురం కాంగ్రెస్ అభ్యర్థి ఎంహెచ్.ఇనాయతుల్లా


కాంగ్రెస్ అభ్యర్థి ఇనయతుల్లా

ప్రజాశక్తి-హిందూపురం

తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడానికి కషిచేస్తానని ఇండియా వేదిక హిందూపురం నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంహెచ్.ఇనాయతుల్లా తెలియజేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆయన నియోజకవర్గంలోని అన్ని మండలాలు, పట్టణాల్లో విస్తతంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ప్రచారంలో భాగంగా చివరి రోజు శనివారం తన నివాసంలో ప్రజాశక్తితో మాట్లాడారు.

ప్రచారంలో ప్రజల స్పందన ఎలా ఉంది..?

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, సేవే మార్గంగా తాను రాజకీయాల్లోకి వచ్చాను. వ్యాపార వేత్తగా ఉండటం, స్థానిక వ్యక్తి కావటంతో ప్రతిఒక్కరూ తనను వ్యక్తిగతంగా ఆదరిస్తున్నారు. గత కొన్నేళ్లుగా తాను పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాను. తద్వారా ప్రజలందరితో మమేకమై ఉన్నాను. ఆ పరిచయాలతో ప్రతిఒక్కరూ మంచి నాయకుడిగా గుర్తించి ఆదరిస్తున్నారు.

హిందూపురం అభివృద్ధిపై మీ స్పందన.?

గత నాలుగు దశాబ్దాలుగా హిందూపురం నియోజక వర్గం అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. అభివృద్ధి ఎద్దైన జరిగింటే అది కేవలం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో మాత్రమే అన్నారు. నాడు హిందూపురం ప్రాంతానికి పారిశ్రామిక వాడను తీసుకొచ్చింది కాంగ్రెస్ పార్టీ అన్నారు. రూ.650 కోట్లతో ఆసియా ఖండంలోనే అతి పెద్ద నీటి పథకాన్ని తీసుకొచ్చి హిందూపురం పట్టణంలో నీటి సమస్యను పరిష్కరించింది కాంగ్రెస్ పార్టీ అన్నారు. టిడిపి, వైసిపి అధికారంలో ఉన్న సమయంలో వారి స్వలాభమే చూసుకున్నారే తప్పా ప్రజల బాగోగుల గురించి పట్టించుకోలేదన్నారు. తనను ఈ ఎన్నికల్లో గెలిపిస్తే హిందూపురం నియోజకవర్గం సమగ్రాభివద్ధికి శక్తివంచన లేకుండా కషిచేస్తానని వివరించారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రాధాన్యత ఇస్తానన్నారు. విద్యా, వైద్యం, ఆరోగ్యం, పౌరసేవలు, సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అర్హులకు అందేలా శక్తివంచన లేకుండా కషిచేస్తానన్నారు. నాయకుడు అంటే భయభ్రాంతులకు గురి చేసేలా కాకుండా ఆపదలో అండగా ఉంటూ, కష్టంలో ధైర్యం చెప్పేలా ఉండాలన్నారు.

పారిశ్రామిక వాడకోసం ఏమి చేస్తారు.?

ఉమ్మడి జిల్లాలో అతి పెద్ద పారిశ్రామికవాడ హిందూపురం ప్రాంతంలో ఉంది. ఇప్పటికే సెజ్‌ల పేరుతో పరిశ్రమల కోసం భూములు సైతం సేకరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఎక్కువ ఉపాధి కల్పన పరిశ్రమలు తీసుకురావటానికి కషిచేస్తాను. మహిళల స్వయం ఉపాధి నిమిత్తం కుటీర పరిశ్రమల ఏర్పాటుకు కూడా ప్రాధాన్యత ఇస్తాను. నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు శక్తివంచన లేకుండా కృషిచేస్తాను.

రైతులకు ఎలాంటి చేయూతనిస్తారు..?

వేరుశనగ, మల్బరి, మొక్కజొన్న రైతుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తాను. వ్యవసాయం, దాని అనుబంధ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు వచ్చేలా కషిచేస్తాను. వైసిపి ప్రభుత్వం సాగునీటి సంఘాలను రద్దు చేసింది. సహకార బ్యాంకులకు ఎన్నికలు నిర్వహించకుండా త్రిసభ్య కమిటీలతో వైసీపీ ప్రభుత్వం కాలం గడిపేసింది. దీని వల్ల రైతులకు రావాల్సిన డబ్బు పక్కదారి పట్టింది. బ్యాంకులు నష్టాల్లో ఉన్నాయన్నారు. సహకార బ్యాంకులను లాభాల్లో తీసుకు రావాడానికి కృషి చేస్తాం. వ్యవసాయ ఉత్పత్తులకు నాణ్యమైన, మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు అందుబాటులో ఉండేలా కషిచేస్తాం.

వైద్యం, మౌలిక సదుపాయల కల్పనకు ఏమి చేస్తారు..?

హిందూపురం పట్టణంలో ఉన్న ప్రభుత్వ అసుపత్రికి జిల్లా స్థాయి హోదా కల్పించినప్పటికి దానికి తగ్గట్టు సౌకర్యాలు లేవు. ఇక్కడ అన్ని సౌకర్యాలను కల్పించడంతో పాటు నూతన సాంకేతికతతో కూడిన వైద్య పరికారాలను తీసుకు రావాడనికి కృషి చేస్తాం. ఉమ్మడి జిల్లాలో సెలక్షన్ గ్రేడ్ హోదా కలిగిన హిందూపురం పట్టణంలో భూగర్భ మురుగు కాలువ వ్యవస్థ లేక పోవడంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తనను ప్రజలు ఆశీర్వదిస్తే అధికారంలోకి వచ్చిన వెంటనే భూగర్భ మురుగు కాలువ వ్యవస్థను తీసుకు రావాడంతో పాటు పట్టణంలో పూర్తి స్థాయిలో అంతర్గత రహదారులను ఏర్పాటు చేస్తాం. బిజెపి ప్రభుత్వంలో రైళ్లలో జనరల్ బోగీలు తీసేయడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బెంగళూరు నుంచి విజయవాడ, హైదరాబాద్ వెళ్లే ట్రైన్లలో జనరల్ బోగీలు పెంచేలా రైల్వే బోర్డు అధికారులతో మాట్లాడతాను.

ఇతర హామీలు ఉన్నాయా..?

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తొమ్మిది హామీలను ఖచ్చితంగా అమలు చేస్తాం. రెండు లక్షల రైతు రుణమాఫీ, ప్రతి కుటుంబంలో మహిళకు నెలకు రూ.8,333, ఉపాధి హామీ కూలీలకు కనీస వేతనం రూ.400, ఐదు లక్షలతో పేదలకు గృహ నిర్మాణం, వద్ధులకు పెన్షన్ రూ.4వేలు, వికలాంగులకు రూ.6వేలు, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రైతులకు గిట్టుబాటు ధర, ఉచిత విద్య తదితర పథకాలను అమలు చేస్తాం. ప్రజలందరూ కాంగ్రెస్ అందించే సంక్షేమ పథకాలను గుర్తించి ఈనెల 13 జరిగే ఎన్నికల్లో అందరూ కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఎంహెచ్.ఇనయతుల్లా కోరారు.

సెంటిమెంట్‌ను తిరగరాస్తాం

ఉరవకొండలో వైసిపి జెండా ఎగురవేస్తాం - సేవ చేశా కాబట్టే ఓట్లడుగుతున్నా.. - వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి



ప్రజాశక్తి-వజ్రకరూరు

సార్వత్రిక ఎన్నికల్లో ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఉరవకొండ నియోజకవర్గంలో వైసిపి జెండా ఎగురవేసి చరిత్ర సృష్టిస్తామని ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. విశ్వేశ్వర్‌రెడ్డి అంటేనే విశ్వసనీయత అని.. ప్రజల్లోనే ఉంటూ సేవ చేశా కాబట్టే ఎన్నికల్లో ఓటు అడుగుతున్నానన్నారు. ప్రత్యేకంగా నియోజకవర్గ ప్రజలు చూపుతున్న ఆదరాభిమానాలు, మహిళల ప్రేమాభిమానాలు గెలిపిస్తాయన్నారు. కరోనా కాటు వేసినా ఎక్కడా అభివృద్ధి ఆపకుండా సంక్షేమ పథకాలు అందించామన్నారు. నియోజకవర్గంలో 10,600 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేయడంతోపాటు 26వేల ఇళ్లు మంజూరు చేయించామన్నారు. ఐదేళ్లలో చేసిన అభివృద్ధిని బేరీజు వేసుకుని మీకు మంచి జరిగిందని అనిపిస్తేనే ఓట్లేయాలని ప్రజలను కోరారు. ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో వై.విశ్వేశ్వరరెడ్డి పలు విషయాలను వెల్లడించారు.

చరిత్ర సష్టిస్తాం..

ఈసారి నియోజకవర్గంలో ఖచ్చితంగా వైసిపి జెండా ఎగురవేసి చరిత్ర సృష్టిస్తాం. ఎందుకంటే ప్రచారానికి ఏగ్రామానికి వెళ్లినా ప్రజల నుంచి వస్తున్న స్పందనే తన ధైర్యం. నేను గెలవడంతోపాటు రాష్ట్రంలోనూ వైసీపీనే తిరిగి రెండోసారి అధికారంలోకి రావడం ఖాయం. ఈసారి గెలిస్తే నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులన్నీ పూర్తి చేస్తాం.

టిడిపివి హత్యా రాజకీయాలు

టిడిపి అధికారంలో ఉన్నప్పుడు పయ్యావుల కుటుంబం హత్యా రాజకీయాలను ప్రోత్సహించడం వల్ల అనేక హత్యలు, దౌర్జన్యాలు జరిగాయి. పోలీస్‌స్టేషన్ పక్కనే ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో వారి అనుచరులు హత్య చేసిన విషయం మీకు తెలిసిందే. అయితే మేము అధికారంలోకి వచ్చాక ఎక్కడా రాజకీయ హత్యలు, దౌర్జన్యాలను ప్రోత్సహించలేదు.

ప్రజలకే జవాబుదారిని

గ్రామాల్లో ఎవరికి ఎంత ప్రజాబలం ఉందో ప్రజలందరికీ తెలుసు. పయ్యావుల కేశవ్ ప్రచారంలో కేవలం నన్ను తిట్టేందుకే అధిక ప్రాధాన్యత ఇచ్చారు. నేను వాటి గురించి మాట్లాడి సమయం వృథా చేసుకోదల్చుకోలేదు. నేను ప్రజలకు మాత్రమే జవాబుదారిని. నేను ఎంతటి సమర్థుడునో ప్రజలకు తెలుసు. నా ప్రధాన ప్రత్యర్థి భారీగా డబ్బులు వెదజల్లినా విజయం నాదే.

సంక్షేమంతోపాటు రూ.వెయ్యి కోట్ల అభివృద్ధి పనులు చేశాం

ఐదేళ్లలో నియోజకవర్గంలో ప్రజలకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.2500 కోట్ల లబ్ధిని చేకూర్చాం. ఎక్కడా పార్టీలు, కులమతాలు చూడలేదు. మరో రూ.వెయ్యి కోట్ల అభివృద్ధి పనులు చేశాం. ఇందులో ఉరవకొండలోనే సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.10 కోట్లు, 23 గ్రామాలకు రోడ్లు, తాగునీటి పైపులైన్ నిర్మాణానికి రూ.15కోట్లు కేటాయించాం. టెండర్లు కూడా పూర్తయ్యాయి. అయితే కేశవ్ అడ్డుపడటంతో తాత్కాలికంగా ఆగిపోయాయి.

ఓటమి భయంతోనే బెదిరింపులు

ఓటమి భయంతోనే పయ్యావుల కేశవ్ ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులను బెదిరిస్తున్నారు. ఇందులో భాగమే చిన్న ఉద్యోగులపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి వేధింపులకు గురి చేశారు. ఇకపోతే నా కుమారుడు ప్రణయ్‌రెడ్డి చేపట్టిన విజయ సంకల్పయాత్ర తన విజయానికి మరింత తోడ్పాటు ఇచ్చింది. ఈ యాత్రతో నియోజకవర్గవ్యాప్తంగా యువత ఆకర్షితులయ్యారు. తండ్రిలాగే ప్రజలకు అందుబాటులో ఉండి... పిలిస్తే పలికే విధంగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం చిన్న వయసు నుంచే కృషి చేస్తున్నాడు. తండ్రి గెలుపు కోసం సర్వశక్తులు వడ్డుతున్నాడు.

ధర్మం మా వైపే ఉంది

నియోజకవర్గంలో ప్రజలకు మంచి చేశాం.. అందుకే ఓట్లు అడుగున్నాం.. ధర్మం మావైపు ఉంది కాబట్టి ఖచ్చితంగా గెలుస్తాం. ఇప్పటి వరకు రాష్ట్రంలో అధికారం చేపట్టిన పార్టీ ఎమ్మెల్యే ఉరవకొండలో గెలవలేదని అపోహలు ఉన్నాయి. ఈ అపోహలను తుడిచివేసేలా ఉరవకొండతోపాటు రాష్ట్రంలో ఈ ఎన్నికల్లో వైసిపి జెండా ఎగురవేస్తాం.


ప్రచారంలో పాల్గొన్న పవన్‌కళ్యాణ డూప్

భూయాజమాన్య హక్కు చట్టం తుగ్లక్ చర్య

ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్-టిడిపి అర్బన్ కార్యాలయం వద్ద యాక్ట్ ప్రతులు దహనం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పిచ్చి తుగ్లక్ చర్య అని అనంతపురం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు శనివారం అనంతపురం అర్బన్ టిడిపి కార్యాలయంలో చట్ట ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చట్టం పూర్తిగా ప్రజా వ్యతిరేక చర్య అన్నారు. భూములకు సంబంధించిన పత్రాలు, పాస్‌బుక్కులను తన వద్ద పెట్టుకుని కేవలం జిరాక్సులు ఇస్తానని చెప్పడం ఏంటని ప్రశ్నించారు. అసలు చరిత్రల ఇలాంటి చట్టాన్ని ఎప్పుడైనా చూశామా.. అని నిలదీశారు. పిచ్చి తుగ్లక్ తరహాలో జగన్ పాలన సాగించారన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం పార్లమెంట్ పరిశీలకులు ఈరన్న, తెలుగునాడు అంగన్వాడీ, డ్వాక్రా సాధికార కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు ఆచంట సునీత, అసెంబ్లీ పరిశీలకులు లక్ష్మీనారాయణ, మాజీ మేయర్ స్వరూప, నాయకులు గాజుల ఆదెన్న, నూరు మహమ్మద్, రాయల్ మురళి, సంగా తేజస్విని, సైపుద్దీన్, పోతుల లక్ష్మీనరసింహులు, పరమేష్, శ్రీధర్, రమాదేవి, అయేషా, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా దగ్గుపాటి ఫ్యామిలీ ప్రచారం

ఎన్నికల ప్రచారంలో చివరి రోజు దగ్గుపాటి కుటుంబ సభ్యులు విస్తృతంగా ప్రచారం చేపట్టారు. ఓవైపు దగ్గుపాటి సతీమణి శ్రీలక్ష్మి, ఇంకోవైపు దగ్గుపాటి సోదరులు, వారి సతీమణులు జోరుగా ప్రచారం చేశారు. శ్రీలక్ష్మి ఉదయం రహమత్ నగర్, మధ్యాహ్నం 4వ డివిజన్, సాయంత్రం మారుతీనగర్, దగ్గుపాటి జగన్ సతీమణి సాయిలీల 36వ డివిజన్‌లో, దగ్గుపాటి ప్రతాప్ సతీమణి అనిత 42వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం చేశారు.

ప్రత్యేక ఆకరణగా పవన్‌కళ్యాణ్ డూప్

చివరి రోజు ఎన్నికల ప్రచారంలో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ డూప్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అంబేద్కర్ ఫ్లైఓవర్ వద్ద నుంచి ప్రారంభమైన ప్రచార ర్యాలీ సప్తగిరి సర్కిల్, ఓల్డ్‌టౌన్, శ్రీకంఠం సర్కిల్, టవర్ క్లాక్, బళ్లారి బైపాస్ మీదుగా అర్బన్ టీడీపీ కార్యాలయం వరకూ సాగింది. ఆ ర్యాలీలో పవన్‌కళ్యాణ్ పోలికలతో ఉండే రాజేంద్ర అచ్చం ఆయన హావభావాలతో ప్రజలను ఆకర్శించారు.


ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ప్రతులను దగ్ధం చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజా సంక్షేమానికి చంద్రబాబు పెద్దపీట

అమిలినేని సురేంద్రబాబు


ప్రజలకు అభివాదం చేస్తున్న టిడిపి అభ్యర్థి సురేంద్రబాబు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

టిడిపి అధినేత చంద్రబాబు ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తారని టిడిపి అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు అన్నారు. శనివారం మండల పరిధిలోని పాపంపల్లి, మోరేపల్లి, కొత్తూరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు, మహిళలు సురేంద్రబాబుకు మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. ముందుగా మోరేపల్లిలో ఫాదర్‌ఫెర్రర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయా గ్రామాల్లో రోడ్‌షో నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసిపి ఐదేళ్లపాలనలో సాగు, తాగునీరు ఇవ్వలేదన్నారు. గత టిడిపి పాలనలో మంజూరైన రోడ్లకు నేటికీ బిల్లు మంజూరు చేయకపోవడం బాధాకరమన్నారు. అంతేగాకుండా చంద్రబాబు బీటీపీ ప్రాజెక్ట్ పనులను ప్రారంభిస్తే వైసిపి ప్రభుత్వం వచ్చాక నిధులు కేటాయించకుండా మోసం చేసిందన్నారు. వీటికితోడు అరాచకాలు, ఇసుక, మద్యం దోపిడీ, దౌర్జన్యాలు, దాడులు, అక్రమ కేసులతో జగన్ పాలన సాగుతోందన్నారు. కావున ఈనెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి వైసిపికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మోరేపల్లి మల్లికార్జున, పాపంపల్లి రామాంజనేయులు, గోవిందరెడ్డి, రాము, ఆంజనేయులు, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

'ఇండియా వేదిక' గెలుపు దేశానికి రక్ష

విద్వేషాలు రెచ్చగొట్టే బిజెపిని ఓడించాలి : సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ


ఆటోల ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఐ నాయకులు, ఆటో కార్మికులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించడం ద్వారానే దేశవ్యాప్తంగా రైతులు, శ్రామికులకు రక్షణ అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సూచించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం అనంతపురంలో సిపిఐ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండియా కూటమి గెలవడం దేశానికి రక్షణగా నిలుస్తుందన్నారు. ముఖ్యంగా లౌకిక వాదంతో దేశ పరిపాలన సాగిస్తుందన్నారు. దేశ ప్రధాని మోడీ పదేళ్ల పాలనలో మత విద్వేషాలను రెచ్చగొట్టడం, ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేయడంతో పాటు భారత రాజ్యాంగాన్ని రూపుమాపాలనే దుష్ట పాలన సాగించారని ఆరోపించారు. ఎన్‌డిఎ పాలనలో పేదలు, వ్యవసాయ కార్మికులు, శ్రామిక వర్గాన్ని ప్రోత్సహించిన దాఖలాలు లేవన్నారు. పదేళ్ల పాలన అంతా కూడా ప్రతిపక్షాలను అంతం చేయాలనే ప్రయత్నాలు చేశారన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో ఏ రకంగానైనా సరే అధికారాన్ని చేజిక్కించుకోవాలని వారి ప్రయత్నాలు ఉన్నప్పటికీ ఇంతవరకూ జరిగిన మూడు దఫాల ఎన్నికల్లో ఎన్‌డిఎకు ఎదురుగాలి వీచిందనే విషయం స్పష్టంగా అర్థమైందన్నారు. ప్రజలు ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎన్‌డిఎ కూటమికి దేశంలోని ముస్లింలు, క్రైస్తవులు, పేదలు, రైతులు, కార్మికులు దూరమయ్యారనే విషయాన్ని ప్రధానికి అర్థమైందన్నారు. ఓటింగ్ సమయం దగ్గరలో ఉందని, ప్రజలు మరింత జాగ్రత్తగా ఆలోచించి ఓటు వేయాలన్నారు. రాష్ట్ర ప్రజలు గుర్తించాల్సిన అవసరం ఏమిటంటే జగన్, చంద్రబాబు ఇద్దరిలోఎవరికి ఓటు వేసినా మోడీకి వేసినట్లేనని ఇది వాస్తవాన్ని ప్రజలందరూ గుర్తించాలని సూచించారు. ముఖ్యమంత్రి జగన్ ఐదు సంవత్సరాల పాలన ప్రజా సంక్షేమానికి, రాష్ట్ర అభివృద్ధికి విడ్డూరంగా పాలన సాగించారని తన ప్యాలెస్‌లో కూర్చొని నియంతల పాలన సాగించడం కారణంగా రాష్ట్రం ఆర్థికంగా, అభివృద్ధి పరంగా బాగా నష్టపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్‌డిఏ, వైసీపీ పాలనకు ప్రజలు స్వస్తి చెప్పాలని, రాష్ట్రానికి కాపాడే బాధ్యత ఇండియా కూటమి తీసుకుంటుందని ప్రజలు ఆదరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.జగదీష్, ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థులు వి.మల్లికార్జున, జాఫర్, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా తనిఖీలు

అనంతపురం క్రైం : ఎన్నికలు సమీపిస్తుండటంతో ఎస్పీ అమిత్‌బర్దర్ ఆదేశాల మేరకు అనంతపురం పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా అనంతపురం డీఎస్పీ టివివి.ప్రతాప్ నేతృత్వంలో ఓటర్లను ప్రభావితం చేసే డబ్బు, లిక్కర్, ఎన్నికల తాయిలాలకు సంబంధించిన సామగ్రి రవాణా కాకుండా జిల్లాకేంద్రంలోని ప్రధాన రహదారులు, కూడళ్లు, కాలనీలు, శివారు ప్రాంతాల్లో వాహనాలను తనిఖీ చేశారు. వీటితోపాటు ఆర్టీసీ బస్టాండు, రైల్వేస్టేషన్లలో తనిఖీలు నిర్వహించి అనుమానితులు, వారు తీసుకెళ్తున్న లగేజీ బ్యాగులను పరిశీలించారు. ఈ తనిఖీల్లో సిఐలు రెడ్డెప్ప, క్రాంతికుమార్, ధరణీకిశోర్, ప్రతాప్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు మాయమాటలు నమ్మొద్దు

ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు మాలగుండ్ల, వీరాంజనేయులు


మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి శంకరనారాయణ

ప్రజాశక్తి-అనంతపురం

టిడిపి అధినేత చంద్రబాబు మాయమాటలను ప్రజలు నమ్మకుండా ఎన్నికల్లో వైసిపిని ఆదరించాలని ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు శంకరనారాయణ, ఎం.వీరాంజనేయులు సూచించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో రోడ్‌షో నిర్వహించారు. మండల కేంద్రంలోని నార్పల క్రాస్ నుంచి బస్టాండ్ కూడలి వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శంకరనారాయణ మాట్లాడుతూ విశ్వసనీయత, సంక్షేమానికి మారుపేరు సిఎం జగన్ అన్నారు. అంతేగాకుండా ప్రతి ఇంటికీ సంక్షేమకాన్ని అందించి ప్రజల మనస్సును దోచుకున్న ఘనుడు జగన్ అన్నారు. సాధ్యం కానీ హామీలను మేనిఫెస్టోలో చేర్చి ప్రజలను మోసం చేయడం జగన్‌కు సాధ్యం కాదన్నారు. నిత్యం ప్రజలను మోసం చేసే దగాకోరుల టిడిపి కూటమికి ఓటు వేసి మోసపోకుండా ప్రజలందరూ విజ్ఞతతో ఓటు వేయాలన్నారు. ఎన్నికప్పుడు మాత్రమే కనిపించే సీజనల్ నాయకులకు ఓటు వేస్తే తిరిగి మళ్లీ ఎన్నికలప్పుడు మాత్రమే కనిపిస్తారన్నారు. చంద్రబాబుకు ఓటు వేస్తే ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ అడ్రస్ లేకుండా పోతాయన్నారు. గతంలో ప్రతిపక్ష హోదాలో జగన్ చేసిసన పాదయాత్ర సందర్భంగా 'నేను విన్నాను..నేను ఉన్నాను' అంటూ భరోసా ఇచ్చి అధికారంలోకి వచ్చాక మేనిఫెస్టోలోని దాదాపు 99 శాతం హామీలను అమలు చేసి దేశంలోనే చరిత్ర సృష్టించారన్నారు. ఏదిఏమైనా మరో రెండు రోజుల్లో జరగబోయే కురుక్షేత్ర సంగ్రామంలో నీతికి.. న్యాయానికి.. విశ్వసనీయతకు.. సంక్షేమానికి పెద్దపీట వేసే జగన్ ప్రభుత్వాన్ని మరోమారు ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య, జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, రాష్ట్ర రజక కార్పొరేషన్ ఛైర్మన్ మీసాల రంగన్న, జడ్పిటిసి నీలం భాస్కర్, సర్పంచి పార్వతి, ఆలూరు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


డిఐజి షిమోషికి మొక్క అందజేస్తున్న శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డి

అనంతపురం రేంజ్ డిఐజికి ఎస్పీ స్వాగతం

పుట్టపర్తి రూరల్ : అనంతపురం రేంజ్ డిఐజి షిమోషిని శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి శనివారం సాయంత్రం జిల్లా పోలీస్ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ ఎన్.విష్ణు, ఎఆర్ డీఎస్పీ జెడ్.విజయ్‌కుమార్, ఎస్‌బి సిఐ బాలసుబ్రమణ్యంరెడ్డి, సైబర్ సెల్ సిఐ హేమంత్ కుమార్, సిసి రాఘవేంద్ర, ఎఆర్ఐలు రవికుమార్, వలి, ఎస్‌బి ఎస్ఐ ప్రదీప్‌కుమార్, పోలీసు అధికారులు ఉన్నారు.

ఓటర్లకు యథేచ్ఛగా మద్యం, డబ్బు పంపిణీ

పుట్టపర్తి : సార్వత్రిక ఎన్నికల ప్రచారం శనివారం సాయం కాలంతో ముగియడంతో కొత్తచెరువులో ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు ప్రలోభాలకు తెరతీశారు. ఓటర్లకు యథేచ్ఛగా మద్యం, డబ్బు పంపిణీ చేస్తున్నారు. ఆయా పార్టీల నాయకులు ఎన్నికల నోటిఫికేషన్ వెలువడి నప్పటి నుంచి గ్రామాల్లో పోటాపోటీగా ప్రచారం నిర్వహించా రు. పుట్టపర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న అభ్య ర్థులు ఓటరుకు రూ. 2 వేల చొప్పున వారి వారి పార్టీల నాయకుల ద్వారా ప్రజలకు అందజేస్తున్నారు. ఇంత జరుగుతు న్నా ఎన్నికల అధికారులు కానీ, పోలీసులు కానీ ఏ మాత్రం పట్టించుకోవడంలేదు. ఇకనైనా ఎన్నికల అధికారులు స్పందించి ప్రలోభాలను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పోలింగ్ రోజు దుకాణాలు మూసేయండి : సిఐ


పుట్టపర్తి : ఈ నెల 13వ తేదీ(సోమవారం) పోలింగ్ దృష్ట్యా ఎన్నికల నిబంధనల ప్రకారం కొత్తచెరువులో వ్యాపారులు దుకాణాలు, హోటళ్లను మూసివేయాలని సిఐ రాజా రమేష్ ఆదేశించారు. ఎన్నికల నియమంలో భాగంగా దుకాణాలు మూసివేసి యజమానులు సహకరించాలన్నారు. మద్యం దుకా ణాలను 48 గంటలు ముందుగానే బంద్ చేయించామన్నారు. మండలంలో ప్రశాంతంగా ఎన్నికలు జరగడానికి భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. 144 సెక్షన్ ఆంక్షలు అమలులో ఉన్నందున ప్రజలు ఎక్కడా గుంపులు గుంపులుగా ఉండకూడదని హెచ్చరించారు.

ఓటరు స్లిప్పులు అందక ఇక్కట్లు

పుట్టపర్తి : కొత్తచెరువు మండలంలోని పలు గ్రామాల్లో బిఎల్ఒలు, సచివాలయ సిబ్బంది సక్రమంగా ఓటరు స్లిప్పులు పంపిణీ చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం బిఎల్ఒల ఆధ్వర్యంలో పోలింగ్‌కు 48 గంటల ముందుగానే ఓటర్ స్లిప్పులను వారి ఇళ్ల వద్దకే వెళ్లి అందజేయాల్సి ఉంది. ఇప్పటికీ అందకపోవడంతో ఓటర్లు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే వారు లేరు. కొత్తచెరువు మేజర్ పంచాయతీలో పలు వార్డుల్లో ఓటర్లకు ఇప్పటికీ ఓటర్ స్లిప్పులు అందకపోవడంతో ప్రజలే డబ్బులు చెల్లించి నెట్ సెంటర్లలో తీసుకొంటున్నారు. ఇకనైనా ఎన్నికల అధికారులు స్పందించి ఓటు హక్కు ఉన్న వారందరికీ ఓటరు స్లిప్పులు ఇంటి వద్ద అందజేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

టిడిపి నుంచి వైసిపిలో చేరిక

కొత్తచెరువు రూరల్ : మండలంలోని నారేపల్లి గ్రామంలో టిడిపికి చెంది న పలువురు శనివారం వైసిపిలో చేరారు. గ్రామానికి చెందిన చంద్రారెడ్డి, చిన్న బోయినపల్లి గ్రామానికి చెందిన గొల్ల ఉత్తప్ప వైసిపిలో చేరగా పుట్టపర్తి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి వారికి పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించా రు. శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ వైసిపిలో చేరిన వారికి సముచిత స్థానం లభిస్తుందని, ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.


శ్రీధర్‌రెడ్డి సమక్షంలో వైసిపిలో చేరిన నాయకులు

'పురం' సమగ్రాభివృద్ధే ధ్యేయం

8 వేల పైచిలుకు మెజార్టీతో గెలుస్తా.. హామీలన్నీ నెరవేరుస్తా..

స్వతంత్ర అభ్యర్థి పరిపూర్ణానంద స్వామి


సమావేశంలో మాట్లాడుతున్న పరిపూర్ణానంద స్వామి

ప్రజాశక్తి-హిందూపురం

సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించి అసెంబ్లీలో అడుగుపెట్టిన తర్వాత హిందూపురం సమగ్ర అభివృద్ధికి ఇచ్చిన మాటకు కట్టుబడి కృషి చేస్తానని కాకినాడ శ్రీపీఠం పీఠాధిపతి, హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి పరిపూర్ణానందస్వామి పేర్కొన్నారు. నామినేషన్ ప్రక్రియ నుంచి ఇప్పటి వరకూ హిందూపురం ప్రజలు తనను ఎంతో ఆదరించారన్నారు. పట్టణంలోని తన కార్యాల యంలో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ తాను మాట ఇస్తే దానికి కట్టుబడి ఉంటాన న్నారు. ఇందులో భాగంగానే ఎన్నికల ప్రక్రియలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని గెలిచిన తర్వాత నెరవేరుస్తానని తెలిపారు. ఏ ప్రభుత్వం ఏర్పడినా తాను ఎమ్మెల్యేగా గెలుపొందితే హిందూపురం ప్రజలకు ఏడాదికి రూ. లక్ష లబ్ధి చేకూర్చేలా కృషి చేస్తానన్నారు. ప్రతి ఇంటికీ రోజూ 20 లీటర్ల శుద్ధ జలాలు, 150 యూనిట్ల వరకూ సోలార్ ద్వారా ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పిస్తానన్నారు. తాను అసెంబ్లీలో అడుగు పెడితే అక్కడి సభ్యులకు సభా మర్యాద గురించి తెలియజేస్తానన్నారు. హంగ్ ప్రభుత్వం ఏర్పడితే తన అభ్యర్థిత్వం ఎంతో కీలకమవుతుందని, అప్పుడు హిందూపు రం ప్రజల నిర్ణయానికి అనుగుణంగా వ్యవహరిస్తానన్నారు. హిందూపురం పట్టణంలో ప్రత్యేక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ధ్యేయంగా పని చేస్తానన్నారు. సమయం తక్కువగా ఉండటం వల్ల ప్రత్యక్షంగా తాను అందరినీ కలవలేకపోయానని, అందరూ ఈ నెల 13వ తేదీ జరిగే ఎన్నికల్లో తనను గెలిపించాలని పరిపూర్ణానంద స్వామి అభ్యర్థించారు. ఎవరు ఏమి చెప్పినా, ఎన్ని చేసినా ఎన్నికల్లో తాను 8 వేల పైచిలుకు మెజార్టీతో గెలవబోతున్నట్లు ధీమా వ్యక్తం చేశారు. తాను గెలిచిన వెంటనే ప్రపంచ వ్యాప్తంగా తనకున్న పరిచయాలతో హిందూపురం నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానన్నారు. తన పాలన లేపాక్షి దుర్గాపాపనేశ్వర అమ్మవారి దేవాలయం నుంచి కొనసాగుతుందని తెలిపారు.

బలిజ కళ్యాణ మండపం నిర్మాణానికి కృషి

ప్రజాశక్తి-సోమందేపల్లి


సవిత వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న బలిజ కులస్తులు

సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలో టిడిపిని గెలిపిస్తే మండలంలోని బలిజ సామాజిక వర్గం ప్రజల కోసం స్థలం కేటాయించి కళ్యాణ మండపం నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయిస్తామని పెనుకొండ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ భర్త వెంకటేశ్వర్లు రాతపూర్వకంగా బలిజలకు హామీ ఇచ్చారు. స్థానిక రంగ మహల్ థియేటర్‌లో శనివారం బలిజల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా టిడిపి పెనుకొండ నియోజకవర్గ పరిశీలకులు నరసింహారావు, వెంకటేశ్వర్లు హాజరై మాట్లా డారు. నియోజకవర్గంలో బలిజ సామాజిక వర్గం ప్రజలను అన్ని రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగా చూస్తున్నాయే తప్ప వారికి ఎలాంటి ఉపయోగకర పనులు చేయలేదని, రాజకీయంగా కూడా ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. బలిజలకు టిడిపిలో అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే సవితమ్మను, ఎంపిగా బికె.పార్థసారధిని అఖండ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం బలిజ కులస్తులు నరసింహారావు, సవిత వెంకటేశ్వర్లును పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. సమావేశంలో బలిజ సంఘ పెద్దలు జవ్వాజి రమేష్, పులివెందల నారాయణస్వామి, ఎస్ఆర్.వెంకటప్ప, కడపల్లి రంగప్ప, నాగమణి, అశ్వర్థ, కొత్తపల్లి రంగ, థియేటర్ తిప్పేస్వామి, జవ్వాజి తిప్పన్న, కడపల్లి రమణప్ప, మణికంఠ కాలనీ శీనప్ప, కడపల్లి నరసింహప్ప, బలిజ కులస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మహమ్మద్ రఫీ

ముదిగుబ్బ : మండలంలోని రాళ్ల అనంతపురం సమీపంలో కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న మహమ్మద్ రఫీ(40) అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. కారు అతివేగంగా వస్తూ ఓవర్ టేక్ చేసే క్రమంలో ద్విచక్ర వాహనాన్ని ఢీ కొనడంతో మహమ్మద్ రఫీ అక్కడికక్కడే మృతి చెందాడు. రఫీ మండలంలోని జొన్నలకొత్తపల్లి గ్రామంలో చికెన్ షాపు నిర్వహిస్తూ జీవనం సాగించేవాడు. ఇతడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇంటికి పెద్దదిక్కును కోల్పోవడంతో ఆ కుటుంబ సభ్యులు బోరున విలపించారు. సమాచారం తెలుసుకున్న ముదిగుబ్బ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సిఐ యతీంద్ర తెలిపారు.

ఎన్నికల నిబంధనలు ధిక్కరిస్తే కఠిన చర్యలు : డీఎస్పీ

ప్రజాశక్తి-కదిరి అర్బన్

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల అధికా రులు ప్రకటించిన నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పకుండా పాటించాలని, అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ శ్రీలత హెచ్చరించారు. పట్టణం లోని డీఎస్పీ కార్యాలయంలో శనివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ కదిరి నియోజకవర్గంలో కొత్త వ్యక్తులు ఉండకూడదన్నారు. ప్రచార సమయం ముగియడంతో రాజకీయ పార్టీలు ప్రచార కరపత్రాలు, డీజేలను నివారించాలన్నారు. ఎన్నికల అధికారుల నిబంధనలను పాటించాలన్నారు. ప్రజలు గుంపులు గుంపులుగా ఉండకూడదన్నారు. మే 13వ తేదీ పోలింగ్ ప్రశాంతంగా జరగడానికి రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. ఓటర్లు క్రమశిక్షణతో వ్యవహరించి క్యూలైన్‌లో వెళ్లి ఇతరులకు ఇబ్బంది కలగకుండా ఓటు వేసి తిరిగి ప్రశాంతంగా ఇంటికి వెళ్లాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద అధికారులు, రాజకీయ నాయకులు, ప్రజలు పోలీసుల నియమ నిబంధనలను తప్పకుండా పాటించాలన్నారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించడానికి కదిరి నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన పోలీసు భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద రెచ్చగొట్టే మాటలు, ప్రలోభాలకు గురిచేయడం వంటివి చేయకూడదని డీఎస్పీ హెచ్చరించారు.

మరోమారు జగన్‌ను సిఎం చేద్దాం

బత్తల హరిప్రసాద్

కదిరి అర్బన్ : ఎన్నికల్లో వైసిపిని గెలిపించి జగన్‌ను మరోమారు ముఖ్యమంత్రిని చేసుకుందామని వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆయన శనివారం మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో ప్రచారం చేశారు. ఈ నెల 13వ తేదీ ప్రతి ఓటరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి కదిరి ఎమ్మెల్యేగా మక్బూల్‌అహ్మద్‌ని, హిందూపురం ఎంపిగా బోయ శాంతమ్మను భారీ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలే వైసిపి అభ్యర్థులను గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ఆయన వెంట వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

తెలుగుతమ్ముళ్ల విస్తృత ప్రచారం

గాండ్లపెంట : సార్వత్రిక ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రంతో ముగిసింది. మండలంలోని సోమయాజులపల్లి, కత్తివారిపల్లి, వేపలకుంట, ఎనుములవారిపల్లి, తదితర గ్రామాల్లో టిడిపి మండల కన్వీనర్ సి.కొండయ్య, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. వారు ఇంటింటికీ వెళ్లి టిడిపి అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్, ప్రజాగళం కరపత్రాలు, పోస్టర్లు పంపిణీ చేశారు. అలాగే వైసిపి ప్రభుత్వ వైఫల్యాలు, అరాచక పాలన గురించి ప్రజలకు వివరించారు. రాష్ట్ర అభివృద్ధి, భావితరాల భవిష్యత్తు కోసం ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి కదిరి ఎమ్మెల్యేగా కందికుంట వెంకటప్రసాద్‌ను, హిందూపురం ఎంపిగా బికె.పార్థసారధిని అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి, బిజెపి, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి నుంచి టిడిపిలో చేరిక

రొద్దం : మండలంలోని గోనిమేకలపల్లి గ్రామానికి చెందిన మూడు కుటుంబాలు శనివారం వైసిపిని వీడి టిడిపిలో చేరాయి. వారికి పెనుకొండ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ పసుపు కండువా వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వన్యప్రాణులకు ఆకలిదప్పుల కష్టాలు



రొద్దం : తీవ్ర వర్షాభావ పరిస్థితులు, వేసవి నేపథ్యంలో అడవిలో ఆహారం, నీరు కరువై వన్యప్రాణులు జనావాసాల వైపు వస్తున్నాయి. రొద్దం సమీప అటవీ ప్రాంతంలోని మూగ జీవాలు ఆహారం, దాహార్తి తీర్చుకునేందుకు నానా అవస్థలు పడుతున్నాయి. ఇందుకు శనివారం మండలంలోని బూచర్ల గ్రామంలో చోటుచేసుకున్న సంఘటనే నిదర్శనం.. రైతు పశువుల కోసం పచ్చి గడ్డిసొప్పును తీసుకొచ్చి గ్రామంలో నాగులకట్ట వద్ద వేయగా ఓ కోతి ఆకలికి తాళలేక దానిని తింటూ కనిపించింది. అలాగే పక్షులు పంట పొలాల్లోకి, రోడ్లు వైపు వస్తున్నాయి. నెమళ్లు ఆహారం కోసం పెనుకొండ-పావగడ ప్రధాన రహదారిలో ఎల్‌జిబి నగర వద్ద ఉన్న విద్యుత్ ఉపకేంద్రం సమీపంలోని పంట పొలాల్లో నిత్యం వస్తున్నాయి.





అగళిలో రోడ్ షోలో పాల్గొన్న ఎంఎస్.రాజు, గుండుమల

హంద్రీనీవా జలాలు తీసుకొస్తాం

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు

ప్రజాశక్తి-అగళి

సార్వత్రిక ఎన్నిక ల్లో టిడిపిని గెలిపిస్తే మండలానికి హంద్రీనీవా నీరు తీసుకొ స్తామని మడకశిర నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్.రాజు హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆయన నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామితో కలిసి రోడ్ షో నిర్వహించారు. వారికి స్థానిక టిడిపి శ్రేణులు గజమాల వేసి ఘన స్వాగతం పలికారు. ఎంఎస్ రాజు టిడిపి అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. అలాగే వైసిపి ప్రభుత్వ వైఫల్యాలు, అరాచక పాలనను ఎండగట్టారు. రాష్ట్ర అభివృద్ధి, భావితరాల భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపిగా బికె.పార్థసారధిని అఖండ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. జిల్లాలో మారుమూల ప్రాంతమైన అగళి మండలాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. రోడ్ షోలో మండల కన్వీనర్ కుమార్‌స్వామి, ఉమేష్, రవికుమార్ పాల్గొన్నారు.



తలమర్లలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

తలమర్లలో పోలీసు కవాతు

కొత్తచెరువు రూరల్ : ఈ నెల 13వ తేదీ(సోమవారం) ఎన్నికలు జరుగుతున్నందున మండల పరిధిలోని తలమర్ల గ్రామంలో సిఐ రాజారమేష్ ఆధ్వర్యంలో సిఆర్‌పిఎఫ్ బలగాలు, స్థానిక పోలీసులతో కలిసి గ్రామంలో కవాతు నిర్వహించారు. వీధుల్లో తిరిగి ఎన్నికలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్నికల్లో ఎవరూ గొడవలకు పాల్పడవద్దని, అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మండల వ్యాప్తంగా పోలింగ్ ముగిసేంత వరకూ 144 సెక్షన్ ఆంక్షలు అమలులో ఉంటాయని, ప్రజలు సహకరించాలని కోరారు.

ప్రజలు విజ్ఞతతో ఓటు వేయాలి

వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

నిత్యం జనంలో ఉండి అభివృద్ధి కోసం పరితపించే కేతిరెడ్డి కావాలో.. నాన్‌లోకల్ వ్యక్తి కావాలో ఆలోచించి ప్రజలు ఓటు వేయాలని ధర్మవరం నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కేతిరెడ్డి వెంకట రామిరెడ్డి సూచించారు. కేతిరెడ్డి శనివారం పట్టణంలోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బిజెపిలో ఉంటూ ఒక సిద్ధాంతం, విలువలు లేకుండా సత్యకుమార్‌యాదవ్ చేస్తున్న రాజకీయం దారుణమన్నారు. ప్రజల్లో స్పందన లేకపోవడంతో వైసిపి శ్రేణులకు డబ్బులు ఎరచూపి కొనుగోలు చేశారన్నారు. వారి నిజస్వరూపం తెలిసిన వైసిపి నాయకులు మళ్లీ వెనక్కి వచ్చి గగ్గోలు పెడుతున్నారన్నారు. తాను తప్పనిసరి పరిస్థితుల్లో ధర్మవరం నియోజకవర్గ రాజకీయాల్లోకి వచ్చానని, 18 ఏళ్లుగా రాజకీయాల్లో ఉంటూ 4 సార్లు ఎన్నికల్లో పాల్గొన్నానన్నారు. 26 ఏళ్లకే ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టి తనవంతుగా కేతిరెడ్డి మార్కు చూపించే విధంగా ధర్మవరానికి శాశ్వత తాగునీటి పథ కాన్ని ప్రారంభించి నీటి ఎద్దడిని నివారించానన్నారు. రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఉన్న సమ యంలో నియోజకవర్గంలో 24వేల మందికి ఇంటి పట్టాలతో పాటు గృహాలు నిర్మించి పేదల సొంతింటి కలను సాకారం చేశానన్నారు. ప్రతి 30వేల జనాభాకు ఒక అర్బన్ హెల్త్ సెంటర్, రెండు నియోజకవర్గాల ప్రజలకు సేవలందించే మదర్ అండ్ చైల్డ్ ఆసుపత్రి నిర్మించామన్నారు. అత్యాధునిక సౌకర్యాలతో కాయగూరల మార్కెట్ ఏర్పాటు చేశామన్నారు. గత ఐదేళ్లలో నవరత్నాలు పథకాలతో 94శాతం మంది పేద ప్రజలకు రూ. 3,200 కోట్లను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశామన్నారు. రూ. 5 వేల కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రజాసేవే పరమావధిగా భావిస్తూ నిత్యం ప్రజ ల్లో ఉండే కేతిరెడ్డి కావాలో.. నాన్‌లోకల్ వ్యక్తి అయిన సత్యకుమార్ కావాలో విజ్ఞులైన ప్రజలు ఆలోచిం చాలన్నారు. ఈ నెల 13వ తేదీ జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైసిపిని భారీ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు.



మీడియాతో మాట్లాడుతున్న కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

వైసిపి గెలిస్తే మీ ఆస్తులకు భద్రత కరువు

పురం టిడిపి ఎంపి అభ్యర్థి బికె.పార్థసారధి

ప్రజాశక్తి-ముదిగుబ్బ

ధర్మవరం నియోజకవర్గంలో మరోమారు వైసిపి గెలిస్తే మీ ఆస్తులకు కూడా రక్షణ ఉండదని హిందూపురం టిడిపి ఎంపి అభ్యర్థి బికె.పార్థసారధి పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం బికె పార్థసారధి, ధర్మవరం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్ ముదిగుబ్బలో పర్యటించారు. ముందుగా స్థానిక కూటమి శ్రేణులు వారిపై పూలవర్షం కురిపించి బాణసంచా పేల్చి గజమాలలు వేసి ఘనస్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో కూటమి అభ్యర్థులు మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి వస్తే అభివృద్ధితో పాటు రాష్ట్రం సస్యశ్యామలంగా ఉంటుందన్నారు. చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ధర్మవరం నియోజకవర్గంలో పెద్దఎత్తున అవినీతికి పాల్పడిన కేతిరెడ్డిని ఇంటికి సాగనంపాలని ఓటర్లను అభ్యర్థించారు. గుడ్ మార్నింగ్ ధర్మవరం పేరుతో చెరువులు, ఖాళీ స్థలాలను దోచుకున్నాడన్నారు. మాయ మాటలు చెప్పే కేతిరెడ్డిని నమ్మవద్దని ఓటుతో గట్టిగా సమాధానం చెప్పాలని కోరారు. చంద్రబాబు సిఎం అయితే ప్రజలకు బంగారు భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. కావున ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని వారు కోరారు. అనంతరం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ప్రతులను దహనం చేశారు.



ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ప్రతులను దహనం చేస్తున్న అభ్యర్థులు


టిడిపి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

ప్రజాశక్తి -పుట్టపర్తి

యువత అభివృద్ధి చెందాలన్నా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కావాలన్నా టిడిపి అధినేత చంద్రబాబుని ముఖ్యమంత్రి చేసుకుందామని టిడిపి యువ నేత కెంపరాజు, రాజశేఖర్‌గౌడ్ తెలిపారు. టిడిపి ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థులకు మద్దతుగా శనివారం కెంపరాజు ఆధ్వర్యంలో బుక్కపట్నంలో భారీ ర్యాలీ నిర్వహించారు. టిడిపి నాయకులు సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. సర్వజన సంక్షేమం కోసం చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రి చేసుకుందామని తెలిపారు. టిడిపి, జనసేన, బిజెపి కూటమి అధికారంలోకి వస్తేనే రాష్ట్రంలో అభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమవుతుందని తెలిపారు. ఈ నెల 13వ తేదీ ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి హిందూపురం ఎంపీగా పార్థసారధిని, ఎమ్మెల్యేగా పల్లె సింధూరరెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ర్యాలీ స్థానిక మరువాంజనేయస్వామి ఆలయం, ప్రధాన రహదారి, శివాలయం వీధి, బైపాస్ రోడ్డు మీదుగా సాగింది. ర్యాలీలో నాయకులు సాకే యశోద, సామకోటి ఆదినారాయణ, బాలు, చిన్నకృష్ణ, సుబ్బారెడ్డి, లావణ్యగౌడ్, సయ్యద్‌బాషా, సతీష్ రాయల్, వెంకటరాముడు, దాసరి శ్రీనివాసులు, మంజునాథ్, గొర్ల కృష్ణ, సుధీర్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న సవితమ్మ

రొద్దం మండలంలో భారీ మెజార్టీ ఇవ్వాలి

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ

ప్రజాశక్తి-రొద్దం

సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి అభ్యర్థులకు రొద్దం మండ లంలో భారీ మెజారిటీ ఇవ్వాలని పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ ప్రజలను కోరారు. మండలంలోని ఆర్.మరవపల్లి గ్రామంలో శనివారం టిడిపి జిల్లా అధికార ప్రతినిధి నరసింహులు నివాసం వద్ద మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సవితమ్మ హాజరై మాట్లాడారు. గత ఎన్నికల్లో నియోజకవర్గ వ్యాప్తంగా 5 మండలాల్లో టిడిపికి రొద్దం మండలంలో ఎక్కువ మెజార్టీ వచ్చేదన్నారు. ఈ ఎన్నికల్లో కూడా భారీ మెజార్టీ ఇవ్వాలని కోరారు. 2019 ఎన్నికల్లో జగన్ ఒక్క ఛాన్స్ అని రాష్ట్ర ప్రజలను మోసం చేశారన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం ప్రతి ఓటరూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపిగా బికె.పార్థసారధిని అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో మండల కన్వీనర్ నరహరి, జిల్లా అధికార ప్రతినిధి నరసింహులు, మాధవనాయుడు, చిన్నప్పయ్య, అశ్వర్థనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



టిడిపి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న నాయకులు

వైసిపి నుంచి టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు కోవెలగుట్టపల్లిలో శనివారం 10 వైసిపి కుటుంబాలు టిడిపిలో చేరాయి. పార్టీ పట్టణ కన్వీనర్ రామాంజనేయులు ఆధ్వర్యంలో వారు టిడిపిలో చేరగా నాయకులు పసుపు కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ గత ఐదేళ్లుగా తాము వైసిపిలో ఉన్నప్పటికీ తగిన గుర్తింపు లేదన్నారు. ఆ పార్టీలో ఉన్నన్ని రోజులు నాయకుల ప్రవర్తనతో, అవమానాలతో బాధపడ్డామన్నారు. రాష్ట్ర, నియోజకవర్గ అభివృద్ధి టిడిపితోనే సాధ్యమని నమ్మి పార్టీలో చేరామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గూడూరు ఓబులేసు, ఆ వార్డు కౌన్సిలర్ లక్ష్మీనరసమ్మ, రామకృష్ణ, సత్యనారాయణ, నారప్ప, ఎన్. ఆంజనేయులు, శ్రీనివాసులు, ఓబులేసు, ప్రభాకర, కృష్ణమూర్తి, కేశవ, ఆదిమూర్తి, శ్రీరంగప్ప, రామంజి, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

తెలుగుతమ్ముళ్ల ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-గాండ్లపెంట

సార్వత్రిక ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రంతో ముగిసింది. మండలంలోని సోమయాజులపల్లి, కత్తివారిపల్లి, వేపలకుంట, ఎనుములవారిపల్లి, తదితర గ్రామాల్లో టిడిపి మండల కన్వీనర్ సి.కొండయ్య, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి ఆధ్వరంలో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. వారు ఇంటింటికీ వెళ్లి టిడిపి అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్, ప్రజాగళం కరపత్రాలు, పోస్టర్లు పంపిణీ చేశారు. అలాగే వైసిపి ప్రభుత్వ వైఫల్యాలు, అరాచక పాలన గురించి ప్రజలకు వివరించారు. రాష్ట్ర అభివృద్ధి, భావితరాల భవిష్యత్తు కోసం ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి కదిరి ఎమ్మెల్యేగా కందికుంట వెంకటప్రసాద్‌ను, హిందూపురం ఎంపిగా బికె.పార్థసారధిని అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి, బిజెపి, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపికి మద్దతుగా గిరిజన నాయకుల ప్రచారం

పుట్టపర్తి క్రైమ్ : గిరిజనుల అభివృద్ధికి పెద్దపీట వేసిన వైసిపికే ఓటు వేయాలని గిరిజన నాయకులు ఓటర్లను అభ్యర్థించారు. గిరిజన ప్రజా సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు వడిత్య శంకర్ నాయక్ ఆధ్వర్యంలో శనివారం సమాఖ్య నాయకులు బడే నాయక్ తండా, గోనేనాయక్ తండాల్లో పర్యటించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా దుద్దుకుంట శ్రీధర్ రెడ్డిని, ఎంపీగా బోయ శాంతమ్మను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో 18వ వార్డు కౌన్సిలర్ డుంగవత్ పర్సు నాయక్, గిరిజన ప్రజా సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు మల్లికార్జున నాయక్, నాయకులు సోమ్లానాయక్, రమేష్‌నాయక్, శంకర్‌నాయక్, గోపాల్‌నాయక్, బాలకృష్ణనాయక్, తదితరులు పాల్గొన్నారు.

తండ్రి మందలించాడని యువకుడు ఆత్మహత్య

ధర్మవరం టౌన్ : పట్టణంలోని రాజేంద్రనగర్‌లో శనివారం రాత్రి ఓ మోటార్ మెకానిక్ ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టూ టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. రాజేంద్రనగర్‌కు చెందిన అమీర్ కుమారుడు రఫీ(18) మోటార్ మెకానిక్‌గా పని చేస్తూ కుటుంబ సభ్యులకు తోడుగా ఉండేవాడు. శనివారం తండ్రి అమీర్ మందలించడంతో తీవ్ర మనస్థాపానికి గురైన రఫీ కుటుంబ సభ్యులు ఇంటి బయట ఉండగా లోపల ఉరి వేసుకున్నాడు. కొద్దిసేపటి తరువాత ఇంట్లోకి వచ్చిన కుటుంబసభ్యులు ఉరికి వేలాడుతున్న రఫీని చూసి బోరున విలపించారు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న టూ టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి ఆత్మహత్యకు గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. తండ్రి అమీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొన్నారు. మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పుట్టపర్తిలో టిడిపి గెలుపు ఖాయం

అభ్యర్థి పల్లె సింధూర, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి



ప్రచారరథంపై నుంచి విజయ సంకేతం చూపుతున్న పల్లె సింధూరరెడ్డి, రఘునాథరెడ్డి

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

పుట్టపర్తి నియోజకవర్గంలో టిడిపి గెలుపు ఖాయం అని ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం వారు మండలంలోని కొండకమర్ల పంచాయతీలో రోడ్ షో నిర్వహించారు. పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ పుట్టపర్తి నియోజకవర్గంలో వైసిపి ఓటమి తథ్యం అని, దీన్ని జీర్ణించుకోలేక వైసిపి మూకలు దాడులు, బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా చంద్ర బాబు ముఖ్యమంత్రి కావడం, పుట్టపర్తిలో పల్లె సింధూరరెడ్డి గెలుపు ఖాయం అన్నారు. నియోజక వర్గంలో సుమారు 27 ఏళ్లుగా ఈ ప్రాంత ప్రజలు తనకు అనేక ఉన్నత పదవులు కల్పించి ఎనలేని అభిమానం, గౌరవం ఇచ్చి ఆదరించారన్నారు. ఎన్ని జన్మలెత్తినా పుట్టపర్తి నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోలేనిదని, నా ఊపిరి ఉన్నంత వరకూ ఈ ప్రాంత ప్రజలకు సేవ చేస్తానని తెలిపారు. తాజా మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సత్యసాయిబాబా తాగునీటి ప్రాజెక్టును కూడా అపహాస్యం చేశార న్నారు. తాగునీటిని తన తోటకు మళ్లించి ప్రజలకు నీళు రాకుండా చేశారన్నారు. ఇలాంటి ఎమ్మెల్యేను మళ్లీ ఎన్నుకుంటే పుట్టపర్తి నియోజకవర్గాన్ని పూర్తిగా అమ్మేస్తాడని ప్రజలను హెచ్చరించారు. ఈ నెల 13వ తేదీ జరిగే సార్వత్రిక ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా పల్లె సింధూరరెడ్డిని, హిందూపురం ఎంపిగా బికె.పార్థసారధిని అఖండ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ప్రచారం లో నాయకులు పిట్టా ఓబుల్ రెడ్డి, మండల కన్వీనర్ జయచంద్ర, ఎద్దుల ప్రమోద్‌రెడ్డి, పొగాకు షఫీ, జాకీర్, రామాంజనేయులు, అంజనప్ప, జనసేన మండల కన్వీనర్ మేకల ఈశ్వర్, రంగారెడ్డి, తదితరు లు పాల్గొన్నారు.

హిందూపురాన్ని రెవెన్యూ డివిజన్ చేస్తాం

అన్నా క్యాంటీన్ల ద్వారా నాణ్యమైన భోజనం అందిస్తాం.. చివరి రోజు భారీ ర్యాలీ, బహిరంగ సభలో బాలయ్య

భార్య వసుంధర దేవితో కలిసి ర్యాలీలో విజయ సంకేతం చూపిస్తున్న బాలకృష్ణ



ప్రజాశక్తి-హిందూపురం

సార్వత్రిక ఎన్నికల ప్రచార పర్వం శనివారంతో ముగిసింది. చివరి రోజు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బాలకృష్ణ తన సతీమణి వసుంధర దేవితో కలిసి పట్టణంలోని అంబేద్కర్ భవన్ వద్ద నుంచి రైల్వే రోడ్డు మీదుగా బాలాజీ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, అంబేద్కర్ సర్కిల్ వరకూ వేలాది మంది అభిమానులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. బాలయ్య దంపతులకు పుర ప్రజలు అడగఅడుగునా నీరాజనాలు తెలిపారు. ఎన్‌బికె అభిమాన సంఘం అధ్యక్షులు నంబూరి సతీష్ గజమాల వేసి నాగలి బహూకరించారు. మరి కొందరు వారికి పూలమాలలు వేసి అభిమానం చాటుకున్నారు. అనంతరం అంబేద్కర్ సర్కిల్‌లో జరిగిన బహిరంగ సభలో బాలకృష్ణ మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే హిందూపురంను రెవెన్యూ డివిజన్‌గా మారుస్తా అన్నారు. చిలమత్తూరు మండలంలోని వీరాపురంలో విదేశీ పక్షులకు ప్రత్యేక వసతులు ఏర్పాటు చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతా అన్నారు. అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేసి నాణ్యమైన భోజనం అందిస్తామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిని కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతామన్నారు. పట్టణం, నియోజక వర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశామన్నారు. గత ఐదేళ్లలో అధికారంలో లేకపోయినా సొంత నిధులతో అభివృద్ధి పనులతో పాటు కరోనా సమ యంలో ప్రభుత్వ ఆసుపత్రికి మందులు, వైద్య పరికరాలు అందించామ న్నారు. ఆరోగ్య రథాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలు అందించామ న్నారు. వైసిపి ప్రభుత్వం అన్నా క్యాంటీన్ ను మూసి వేస్తే సొంత నిధులతో క్యాంటీన్ ఏర్పాటు పేద ప్రజలకు భోజనం అందించామన్నారు. బీసీ, ఎస్సీ, మైనార్టీ కార్పొరేషన్లు అమలు చేసి నిధులు కేటాయించి ఆయా సామాజిక వర్గాలను అభివృద్ధి చేసింది టిడిపి హయాంలోనే అన్నారు. మైనార్టీల వివాహానికి రూ. 50వేలు ఆర్థిక సాయం అందించిన ఘనత టిడిపిదే అన్నారు. నవరత్నాలు పేరుతో సిఎం జగన్ అక్క చెల్లెమ్మలను మోసం చేశారన్నారు. జే బ్రాండ్ మద్యాన్ని తయారుచేసి అనేతక మందిని బలి తీసుకున్నార న్నారు. ల్యాండ్ టైటిటింగ్ యాక్టును తెచ్చి రైతుల భూముల ను స్వాధీనం చేసుకునేందుకు కుట్ర జరుగుతోందన్నారు. ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బికె.పార్థసారధిని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ర్యాలీలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

కదిరి అభివృద్ధికి భరోసా ఏదీ..?

పునాదులకే పరిమితమైన జగనన్న గృహాలు

ఐదేళ్లలో మైనార్టీ పథకాలు కనుమరుగయ్యాయంటూ ఆగ్రహం



కంకరవేసి వదిలేసి కదిరి-రాయచోటి ప్రధాన రహదారి

ప్రజాశక్తి కదిరి టౌన్

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కదిరి నియోజకవర్గంలో అభివద్ధి కుంటుపడిందనే విమర్శలు అటు ప్రతిపక్షాలు, ఇటు ప్రజల నుంచి వ్యక్తం అవుతున్నాయి. కదిరిలో గతంలో 80 శాతం పూర్తయిన కళాశాల భవనాలు నేటికీ పూర్తి కాలేదు. ఇటీవల ముఖ్యమంత్రి చేపట్టిన బస్సుయాత్ర కేవలం రోడ్డుషో మాదిరిగానే సాగింది. ముఖ్యమంత్రి హోదాలో తర్వాత గెలిస్తే కదిరి అభివృద్ధికి చేసే హామీలపైనా ఆయన స్పష్టత ఇవ్వలేదు. పేదల సంక్షేమ కోసమే ప్రభుత్వం అన్న జగనన్న నేడు జగనన్న కాలనీ జాడ లేకుండా చేశారని ప్రజల నుంచి విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. జగనన్న గహాలు కాలనీ పరిసర ప్రాంతాల్లోకి వెళ్లి చూస్తే కనీసం రహదారి సౌకర్యం కూడా కన్పించని పరిస్థితి ఉంది. కదిరి నియోజకవర్గం గాండ్లపెంట ఎన్‌పి.కుంట మండలాలుకు హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ద్వారా సాగునీరు అందజేస్తామని 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీ నేటికీ నెరవేరలేదు. కదరిలో మైనార్టీల కళాశాలను నిర్మిస్తామన్న హామీ కూడా నెరవేరలేదు. గతంలో మైనార్టీలకు అందుతున్న పథకాల్లో కూడా ఈ ఐదేళ్లలో చాలా వరకు కనుమరుగయ్యాయనే భావన మైనార్టీల్లో వ్యక్తం అవుతోంది. ప్రస్తుత ఎన్నికల్లో కూడా అధికార పార్టీ వైసిపి నేతలు కదిరి అభివృద్ధిపై ఎలాంటి స్పష్టమైన హామీలను ఇవ్వకపోవడం ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. తలుపుల, గాండ్లపెంట, నంబులపూలకుంట మండలాలకు హంద్రీనీవా కాలవల ద్వారా సాగునీరు అందిస్తామని చెప్పిన పాలకుల మాటలు నీటి మూటలుగానే మిగిలాయి. ఇక నియోజకవర్గ వ్యాప్తంగా రహదారుల పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. కదిరి రాయచోటి ప్రధాన రహదారిపై పడిన గుంతలను బాగు చేస్తామన్న పేరుతో ప్రధాన రహదారులకు ఇరువైపులా మట్టిని తొలగించి కంకర వేసి వదిలేశారు. ఈ రహదారిపై రాకపోకలు ప్రమా దాలకు నిలయంగా మారాయి. నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. అయినా దీని గురించి ఈ ఐదేళ్లలో పట్టించుకోలేదన్న విమర్శలు ఉన్నాయి.

ముగిసిన ఎన్నికల ప్రచారం

పుట్టపర్తి అర్బన్ : గత కొద్ది రోజులుగా ఎన్నికల ప్రచారంలో హోరాహోరీగా తలపడ్డ నాయకుల ప్రచారానికి శనివారం సాయంత్రం తెరపడింది. ప్రధానంగా టిడిపి, వైసిపి, కాంగ్రెస్ అభ్యర్థులు నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో విస్తృతంగా తిరిగి ఇంటింటికి వెళ్లి ఓటు వేయమని ఓటర్లను అభ్యర్థించారు. ప్రధాన పార్టీల నాయకులు రెండు రోజులుగా గ్రామాల్లో ఓటర్లకు డబ్బులు పంచుతున్నట్లు తెలుస్తోంది. డబ్బు పంపిణీ పర్వం శనివారం రాత్రి కీలకంగా మారనుంది. డబ్బుకు లొంగని ఓటర్లను మద్యంతో పాటు సామదాన దండోపాయ పద్ధతుల్లో తమ వైపు తిప్పుకోవడానికి నాయకులు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ప్రచారం చివరి రోజున ప్రధాన పార్టీల నాయకులు పలుచోట్ల రోడ్డు షోలు నిర్వహించారు. ఓటుకు రూ. 2వేల నుంచి రూ. 3వేల వరకూ పంపిణీ చేసినట్లు సమాచారం. కొందరు ఓటర్లు ఇరు పార్టీల నుంచి డబ్బులు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇలా ఇరు పార్టీలతో డబ్బులు తీసుకోవడంతో ఆయా పార్టీల నాయకులకు ఓటర్ల నాడి దొరక్క తలలు పట్టుకోవాల్సి వస్తోంది. ఇప్పటివరకూ జిల్లా వ్యాప్తంగా చిన్న చిన్న సంఘటనలు మినహా ప్రచారం ప్రశాంతంగా ముగిసింది.

మహిళా సాధికారతే జగన్ లక్ష్యం

వైసిపి ఎమ్మెల్యే, ఎంపి అభ్యర్థులు కేతిరెడ్డి, బోయ శాంతమ్మ



ధర్మవరంలో మహిళలతో కలిసి ర్యాలీగా వెళ్తూ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే, ఎంపి అభ్యర్థులు కేతిరెడ్డి, బోయ శాంతమ్మ

ప్రజాశక్తి-ధర్మవరంటౌన్

మహిళా సాధికరతే లక్ష్యంగా సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలన సాగించారని, ప్రభుత్వ పథకాల్లో మహిళలకే సింహభాగం అందించారని ధర్మవరం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, హిందూపురం ఎంపి అభ్యర్థి బోయ శాంతమ్మ పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం వైసిపి ఆధ్వర్యంలో పట్టణంలో చేపట్టిన ర్యాలీలో అభ్యర్థులతో పాటు కేతిరెడ్డి భార్య సుప్రియ, మరదలు వసుమతి, మహిళలు పాల్గొన్నారు. ర్యాలీ స్థానిక గాంధీనగర్ నుంచి పీఆర్ సర్కిల్, కళాజ్యోతి సర్కిల్, కాలేజ్ సర్కిల్ మీదుగా సాగింది. జై జగన్, జై కేతిరెడ్డి నినాదాలతో మహిళలు హోరెత్తించారు. అభ్యర్థులు మాట్లాడుతూ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మహిళల ఆర్థిక స్వావలంభన కోసం వైఎస్ఆర్ ఆసరా పథకం ద్వారా డ్వాక్రా మహిళలకు రూ. 25వేల కోట్ల రుణాలు మాఫీ చేశారన్నారు. తద్వారా ఎస్‌హెచ్ గ్రూపుల్లో జవసత్వాలు నింపారన్నారు. పిల్లలను బడులకు పంపే తల్లులకు అమ్మఒడి పథకం ద్వారా ఏటా రూ. 15వేలు ఖాతాలో జమ చేశారన్నారు. జగనన్న విద్య, వసతి దీవెన తదితర పథకాలకు సంబంధించి ప్రతి పథకంలో మహిళలకు పెద్దపీట వేశారన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా గర్భిణులు, పిల్లలకు పోషకాహారం అందించారన్నారు. నామినేటెడ్ పదవుల్లో మహిళలకు సింహభాగం ఇచ్చి రాజకీయ ఉన్నతికి తోడ్పడ్డారన్నారు. మహిళాభ్యుదయం కోసం పరితపించే జగన్‌ను మళ్లీ సీఎం చేసుకుంటేనే పథకాలు కొనసాగుతాయ న్నారు. అలాకాకుండా చంద్రబాబు వచ్చాడంటే డ్వాక్రా వ్యవస్థను నిర్వీర్యం చేస్తారన్నారు. పేదలు మరింత పేదలుగా మారుతారన్నారు. ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైసిపిని భారీ మెజారిటీ తో గెలిపించాలన్నారు. ర్యాలీలో పట్టణంలోని 40 వార్డుల నుంచి మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఎన్నో ఆశలు..మరెన్నో ప్రలోభాలు..!



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఐదేళ్లకు ఒకసారి వచ్చే ఎన్నికలంటే రాజకీయ నాయకుల్లోనే కాకుండా ప్రజల్లోనూ ఎన్నో ఆశలు, ఆకాంక్షలు ఉంటాయి. ఇప్పుడున్న ప్రభుత్వం పనితీరును బేరీజు వేసుకోవడం, రాబోయే ప్రభుత్వం ఏ రకంగా ఉండాలని ఆశిస్తూ ఓటు తీర్పును ఇచ్చే సమయమిదే. దీంతో ప్రజా తీర్పు కోసం ఎదురు చూసే పార్టీలు, నేతలు వారిని ఏ రకంగా ఆకట్టుకోవాలన్నది ప్రచార సమయలో ఆధారపడి ఉంటుంది. అన్ని రాజకీయపార్టీలు, స్వతంత్రులు ఊరూరు... ఇంటింటికి తిరిగి తమకు ఓటు వేయాలని ఓటరును వేడుకున్నారు. ఈ సందర్భంగా అనేక హామీలనూ ఇచ్చారు. గత ప్రభుత్వం హయాంలో ఏమి చేసామో అధికార పార్టీ చెప్పుకోగా, ఏ విధంగా విఫలమైందదన్నది ప్రతిపక్ష పార్టీలు ప్రచారం చేశాయి. ఈ రెండింటినీ బేరీజు వేసుకుని వచ్చే ప్రభుత్వం ఏదైతే బాగుంటుందని నిర్ణయానికి వచ్చే సమయం ఇదే. గత వారంలో సిఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డి జిల్లాలో పర్యటించి తమ ప్రభుత్వం ద్వారా చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించే ప్రయత్నం చేశారు. అదే సమయంలో టిడిపి కూటమి తరుపున కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు పర్యటించి ప్రచారలను నిర్వహించారు. ఇక ఆయా నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు కూడా పెద్దఎత్తున ప్రచారాలు చేపట్టారు. ఇదే సమయంలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కూడా జరిగింది. ఈ సమయంలో ఉద్యోగులను ప్రలోభపెట్టే ప్రయత్నాలు సాగాయి. ఉద్యోగుల ఓట్లను దక్కించుకునేందుకు నేతలు అనేక రకాల ప్రయత్నాలను చేశారు. ఈ ప్రచారం కూడా శనివారంతో ముగియనుండటంతో సాధారణ ఓటర్ల ప్రలోభాలు అప్పుడే మొదలయ్యాయి. ఓటుకు వెయ్యి నుంచి రెండు వేల రూపాయల వరకు పంపిణీ ప్రారంభమైంది. కోట్లాది రూపాయలు కట్టలు తెచ్చుకుని ప్రజల్లోకి చేరింది. శనివారంతో మైకులు మూగబోయాయి. ఇన్ని రోజులు సాగిన మైకు ధ్వనులు ఆగిపోవడంతో ఒక్కసారిగా అంతటా ప్రశాంతత నెలకొంది. ఇదే వారంలో మండుటెండల నుంచి కాస్త ఊపశమనిస్తూ వర్షం రావడంతో వాతావరణం కాస్త చల్లబడింది. పోలింగ్ సమయంలోనూ వర్షమున్నట్టు వాతావరణ శాఖ చెబుతోంది. పోలింగ్ లోపు మరోమారు వర్షం పడితే వాతవరణం మరింతగా చల్లబడే అవకాశముంది. మండు టెండలతో రెండు మాసాలుగా ఇబ్బందులు పడిన జనానికి ఇది కాస్త ఊరటనిచ్చేదిగా ఉంది. లేకపోతే అంతక మునుపు వారమంతా సగటున 43 నుంచి 44 డిగ్రీలకుపైగా ఎండ వేడిమి జిల్లాలో ఉంటూ వచ్చింది. ఇది కాస్త తగ్గుముఖం పట్టినట్టయింది. ప్రచార వేడిలాగానే వాతావరణ వేడి తగ్గడంతో ఓటింగ్‌కు అనులకూమైన వాతావరణం ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. వచ్చే వారం మొదటి రోజే జరిగే ఓటింగ్‌లో పాల్గొనేందుకు సుదూరు ప్రాంతాలకు వెళ్లిన వారు కూడా స్వగ్రామాలకు విచ్చేస్తున్నారు. ఆదివారం మరుసటి పోలింగ్ కావడంతో వరుస సెలవులు వచ్చిన నేపథ్యంలో అందరూ పోలింగ్‌కు కోసం తిరిగొస్తున్నారు.